# జారుడు మెట్లు

ఈ కథకు బీజం ఒకానొక మానవుడి సదుద్దేశం. అతడి పేరు శ్రీపతి. సార్థక నామధేయం అతినిది. తండ్రి కొక్కడే కొడుకు. ముద్దులకూ, మురిపాలకూ ఆలవాలమైన తండ్రిగారి పెంపకంక్రింద శ్రీపతి అంతఃపురోద్యానవన పరివేష్టితమైన అద్దాల మేడలో సిద్ధార్థుడిలా పెరిగాడు. మానవ స్వభావం ఒ కట్టడం లాంటిదైతే, ఆ కట్టడంలో ఎన్ని మార్పు లొచ్చినా సరే,చివరకు పాతదాన్ని నేలమట్టం చేసి అక్కడొకకొత్త కట్టడం కట్టినా సరే, దాని తాలూకు పునాదిరాళ్ళు మాత్రం కదిలేటట్టు తోచదు. లోకాన్ని వసంతారామంగా, ఆనందరామంగా తలపోసి, వయసు పైబడినకొద్దీ తన ఊహ తప్పని తెలుసుకోసాగిన శ్రీపతి ఒక్కొక్క పాణి మనుగడా ఒక్కొక్క మ్రోగుతున్న జంత్ర వాయిద్యం కాగా అలాంటి కోట్లకొలది వాయిద్యాల సమ్మేళనంతో నిరంతరంగా సాగిపోతున్న ఈ విశ్వేతిహాస మహాగానంలో ఎక్కడ ఏ చిన్న అపశ్రుతి వినిపించినా ఖిన్నుడై కూర్చుండి పోయేవాడు. శ్రీపతికి నాలుగోయేడు జరుగుతుండగా అత డాటలాడుకునే కొయ్యబొమ్మ కొకదానికి కాలు విరిగి కుంటితనం ప్రాప్తించింది. అప్పటి కప్పుడు కరమల రత్నాచారికి కబురుపంపి విరిగిన కాలికీ, మిగిలిన బొమ్మకూ పునస్సంయోగం కలగజేసే దాకా శ్రీపతి ఏడుస్తూ కూర్చున్నాడు. బడిలో చదువకునే రోజుల్లో శ్రీపతికి మొద్దబ్బాయి అన్న ముద్దు పేరుతో వ్యవహరింపబడుతూ చెలికా డొక డుండేవాడు. లేమిడి కుటుంబంలో వాడి పొట్టనిండుకూ బువ్వ దొరికే వెరవులేదు. లేని ముద్దలకు ప్రత్యామ్నాయంగా పిడిగుద్దులు తినడాని కన్నట్టుగా మొద్దబ్బాయివూగుతూ తూగుతూ బడికొచ్చేవాడు. అయ్యవారి కోపానికి ఆర్థిక, ఆరోగ్య విషయిక, సాంసారిక కారణాలు పెక్కులుండవచ్చు. కానీ మూక ఉమ్మడిగా ఆయనగారి కోపమంతా సద్వినియోగం కావడానికి ఒక్క మొద్దబ్బాయి శరీరం మాత్రమే బాగా ఉపకరించేది. దెబ్బలుతిన్న మొద్దబ్బాయిని యింటికి తీసుకువెళ్ళి శ్రీపతి వాడికి తినుబండారాలు పెట్టించేవాడు. ఫోర్తుఫారంతో హైస్కూలు చదువు చాలించుకుని శ్రీపతి స్వగ్రామానికి తిరిగివచ్చిన క్రొత్తలో కలవారి యింటి బాల వితంతువు ఒకావిడ కమతగాణ్ణి వెంటేసుకుని దేశంపైకి వెళ్ళిపోయింది. ఆవిడ శ్రీపతికి అత్త వరుస. ఆమె ఏమవుతుంది? కూలీనాలీ చేసుకునేవాడితో కలిసి కాపురం ఎలా చేస్తుంది? గుడిసెలో కటిక నేలపైన ఎలా పడుకుంటుంది? తీసుకెళ్ళిన చీరలు చిరిగిపోతే ఏం చేస్తుంది? పొడుగాటి శిరోజాలామెవి. దువ్వి జడ వేసుకోడానికి గంటెడు నూనె సైతం దొరక్కపోతే ఆ శిరోజాల గతి ఏమవుతుంది? లేచిపోయిన అత్తగారిని గురించిన యిలాంటి చింతలతో కుమిలిపోతూ ఒక్కొక్క రాత్రి తెల్లవారేదాకా జాగరణం ఉండిపోయేవాడు శ్రీపతి.

గుండెలో గూడుకట్టుకున్న ఈ మెతకతనంతోబాటుగా పెరిగి పెద్ద వాడయ్యాడు శ్రీపతి. చదువులు చదివి ఉద్యోగాలు చేయవలసిన గ్రహచారం తన కుమారుడికి లేదనీ, కన్నులకు విందుగా

వాడు యింటిపట్టున ఉంటే చాలుననీ అనుకునే తండ్రిగారి పర్యవేక్షణలో శ్రీపతికి కనుచూపానినంత మేరకు అనంతమైన నిర్వ్యాపారత్వమే కనిపించింది. ఎడారిలో ఒంటరితనాన్ని భరించడం కష్టం. శ్రీపతి వెనుదిరిగి చూచాడు. అక్కడ చెప్పనలవి కానంతటి సందడి చెలరేగుతోంది. మధువు, మానిని, జూదం లాంటి వ్యామోహాలు కలిసికట్టుగా ఏలుబడి సాగిస్తున్న సైతాను సామ్రాజ్యం అది. అటో యిటో నన్న ఆ సందిగ్ధ పరిస్థితిలో నుంచీ విచిత్రంగా బయట పడ్డాడు శ్రీపతి. ప్రొద్దుపోకకు ఉపాయాంతరమేదీ స్ఫురించక గోళ్ళు గిట్టుకుంటున్న శ్రీపతికి ఓ సుభముహూర్తాన స్వారీకి ఆయత్తం చేసి తీసుకొచ్చిన జవనాశ్వం ఒకటి కనిపించింది. అప్రయత్నంగా కళ్ళెం చేతికి తీసుకుని రికాబులో కాలుపెట్టి గుర్రం పైకెక్కి కూర్చున్నాడు శ్రీపతి. గుర్రం పరుగిడుతోంది. పాంధోపాస్యభూమీజాల చలువ పందిరిక్రింద సూటిగా ముందుకు దూసుకుపోతున్న రహదారి వెంట గుర్రం పరుగిడుతోంది. అందాల పూలతోటలు దాటుకుని పచ్చని శాలువా పరిచినట్టున్న పైరుపచ్చల నిండా పయనించి, మహారణ్యాలను అధిగమించి చెవిదాకా లాగి విడిచి పెట్టిన బాణంలా గుర్రం పరుగిడుతోంది. ఎన్ని ఊళ్ళు, ఎన్ని నాళ్ళు! మహిడీలెన్ని, కుటీరా లెన్ని! ఎందరు మనుషులు, ఎన్నెన్ని వాలకాలు! గుండెలో అమృతం నింపుకున్న వాళ్ళు కొందరు, అంతరంగంలో హాలాహలాన్ని పదిలపరుచుకున్న వాళ్ళు కొందరు. అంతరంగంలో హాలాహలాన్ని పదిలపరుచుకున్న వాళ్ళు కొందరు. నోటితో మంచిగా మాట్లాడుతూ నొసలితో వెక్కిరించేవాళ్ళు కొందరు. నిష్ఠురభాషణాల వెనుక నవనీత సదృశమైన మనసును దాచుకున్నవాళ్ళు కొందరు. అబ్బో - ఎంద రెందరు! ఎంతటి విశాల మైనదీ ప్రపంచం! బ్రతుకంటే భయంలేని పిల్లలు. బ్రతుకు బరువుతో కృంగిపోయిన పెద్దలు. వెన్నెల్లో పాలకడలి అలలపైన తేలియాడే నురగల్లా విప్పాలించిపోయే స్నిగ్ధ సౌందర్యాల దొంతరలైన యింతులు. బొగ్గుతో చేసిన బొమ్మల్లా చింపిరి తలతో, చిక్కిపోయిన ఒడలితో వికార స్వరూపిణులైన ఉవిదలు. దారిద్ర్యం ఒక వైపున, ధన ధాన్యా లొకవైపున, ఒకచోట దాతృత్వం, ఒకచోటున లోభత్వం. అదొక విచిత్ర ప్రపంచంలా కనిపించింది శ్రీపతికి! స్వర్గనరకాల్లోని తమ తమ వాడలన్నీ ఖాళీచేసివచ్చి సురాసురులందరూ సహజీవానికి ఒడంబడినవార్లై పరస్పర సంబంధ బాంధవ్యాలతో పడుగు పేకగా కలిసిపోయిన తర్వాత కొన్ని వందల శతాబ్దాలకు అదెలాంటి ప్రపంచమైనా యిలాగే ఉంటుంది. శ్రీపతి ఆశ్చర్యపడ్డాడు. శ్రీపతి ఉలికిపడి తనవైపొకసారి చూచుకున్నాడు. తాను కుర్చీలో కూర్చున్న తీరులో మార్పేమీ లేదు! కానైతే తానీ ప్రపంచాన్నంతా ఒక ప్రదక్షిణం వేసుకుని మళ్ళీ యధాస్థానానికి వచ్చి చేరినట్టున్నాడు. ఎలా సంభవమైం దిది?..... శ్రీపతి తన్మయత్వంతో చేతిలో ఉన్న పుస్తకాన్ని గట్టిగా గుండెల కదుముకున్నాడు.

ఆ విధంగా పుస్తక పఠనానికి అలవాటు పడ్డాడు శ్రీపతి. పుస్తకమనగా అది ఒక్కింత ఘనపరిమాణం కలిగిన ఒకానొక వస్తు విశేషంగా శ్రీపతి ఎన్నడూ భావించలేదు. అదే అతడి పాలిటికి అరబ్బీ గుర్రం!

రోజుకొక రెక్కల గుర్రంపైన శ్రీపతి లోకా లోకనం కోసం బయల్దేరేవాడు. ముఖపత్రం దగ్గరినుంచీ ప్రారంభమైన అక్షరపంక్తులు వెంట సాగించే యాత్రలో కనిపించిన ప్రతి దృశ్యాన్నీ, తారసిల్లిన ప్రతి వ్యక్తినీ అతడు జ్ఞప్తిలో ఉంచుకునేవాడు. చేతపుస్తకం లేని తీరిక సమయాల్లో ఆ దృశ్యాలు, ఆ సంఘటనలు, అవన్నీ అతడి మనోవీధిలో మెరపుల్లా మెరసి పోయేవి. పుస్తకం చేతిలో ఉండగా ఒక్కొక్కప్పుడు అతడి కళ్ళల్లో ఆనందభాష్పాలు నిలిచేవి. గుమ్మపాలు త్రాగిన కోడెదూడలా అతడి మనస్సు ఉత్సాహంతో ఉరకలు వేసేది. మరొకప్పుడు మిన్నులు విరిగి తలపైన పడినట్టుగా అతడి మనసు కలవరపడిపోయేది. కథాంతంలో 'సఖోజయం'గా తమ తమ రాజ్యాలను పాలించుకున్న

ధరాధిపుల్ని గురించి, ఒకరి కొకరు తోడునీడగా, పలుకుదోడుగా కాపురంలో సంతోషాలు పండించుకున్న ఆలుమగల్ని గురించి తలచుకుని శ్రీపతి సంబరపడిపోయేవాడు. బాధా సర్పదష్టులై, నిరాశాసంతప్తులై, దైవోపహతులై కాలగర్భంలో కలసిపోయినట్టుగా వర్ణింపబడిన దురదృష్టవంతుల్ని గురించి తలచుకున్నప్పుడల్లా అతడి హృదయంలో గడ్డు తుఫాను రాతిరివేళ జలధితరంగాలకు మల్లే విషాదాను భూతులు హోరులెత్తి పోయేవి. నిర్వహింపవలసిన బాధ్యతలు లేక, చలాయింపవలసిన హక్కుల జోలికి పోక, తనదంటూ ప్రత్యేకించి చెప్పుకోదగిన వ్యక్తిగత జీవితం అసలే లేక, కేవలం పుస్తక ప్రపంచంలోనే గుడారం వేసుకొని నాలుగైదేళ్ళపాటు అలాగే కాలం గడిపేశాడు శ్రీపతి.

అప్పట్లో శ్రీపతి ఓ పుస్తకం చదివాడు. చదివి ముగించిన తర్వాత మళ్ళీ ఒకసారి చదివాడు. అలాగే నాలుగుసార్లు చదివాడు. అందులోని పాత్రలు తమ తమ రూపాలతో బయల్వెడలి వచ్చి తన కళ్ళ యెదుట తారట్లాడుతున్నట్లు భ్రమచెందాడు. వాటి సంభాషణలు అతడి చెవుల్లో గింగుర్లు తిరగి పోసాగాయి. ఆ దృశ్యాలు వెండితెరపైన బొమ్మల్లా అతడి మనసుపైన కదలిపో సాగాయి. ఈ రచనను ట్రాజడీ అని గనీ, కామెడీ అని గానీ వింగడించి చెప్పడం సాధ్యం కాదు. అది పాఠకుడి అభీష్టాలకు వంతపాడుతూ గానీ, లేదా ఆంతరంగికమైన అతడి మనోభావాలను గిలిగింతలు పెడుతూ గాని నడవడం లేదు. దాని యిష్టమే దానిది. దాని ఉరవడే దానిది. విమర్శకుడు గాని శ్రీపతి, విమర్శించాలన్న ఉద్దేశంతో సాహిత్యాన్ని ఏనాడూ చదివి ఎరుగని శ్రీపతి, ఆ రచనను గురించి ఒక్కమాట మాత్రమే చెప్పగలడు. మాటలతో వివరించడానికి వీలులేనిదైన ఏదో వైచిత్రి. ఏదో చమత్కారం, ఆ రచనలో అంతర్లీనమై ఉండి పాఠకుడి వూపిరికి ముకుదాడు వేసి చివరిదాకా లాక్కెళ్తోంది. భూమిపైననడయాడుతున్న ప్రలోభాల కన్నింటికీ అతీతంగా మహోన్నత పర్వత శృంగంపైన కూర్చుని ప్రహసనప్రాయంగా పరిణమించి పోతున్న మానవ జీవితాన్ని ఈకకు ఈకగా, రెక్కకు రెక్కగా విడమరిచి చూపడానికి రచయిత చేసిన ప్రయత్నం అలాంటి రచనగా పర్యవసించి ఉంటుందనుకున్నాడు శ్రీపతి.

అలా అనుకోడంతో శ్రీపతి సరిపెట్టుకోలేక పోయాడు. ఉత్కంఠకు ఆనకట్టలు కట్టుకోలేక అతడు దూరప్రాంతంలో ఉన్న స్నేహితుని కొకడికి జాబు వ్రాశాడు.

వారం పదిరోజుల్లో ప్రత్యుత్తరం వచ్చింది -

"ప్రియమైన శ్రీపతీ! నీ జాబు చేరింది. చదివిన పుస్తకాలను గురించి నువ్వు నాకు జాబు వ్రాయడం అపూర్వమైన విషయమేమీ గాదు. ఈ దేశంలో నివసిస్తున్న కోట్ల కొలది నిరక్షరాస్యులుపాలిటికి ఉప్పుకూ, ఊరగాయకూ కొరగాని యీ దండుగమారి పుస్తకాలు నిన్ను ఉయ్యేల్లో కూర్చోబెట్టి మంటికీ మింటికీ వూపి ఉంటాయనీ నాకు తెలుసు. కానీ, ఏ మాట కా మాటే చెప్పుకోడం మంచిది. మనియార్డర్లు రిసీవు చేసుకుని యిష్టమొచ్చినట్లుగా వెచ్చిస్తూ కూచునే కాలేజీ కుర్రాడిలా నువ్వు చదవడానికైతే చాలా పుస్తకాలు చదివావు. మనియార్డర్లు ఎక్కడనుంచీ వస్తున్నాయో అక్కడి పరిస్థితులను గురించి ఆలోచించే ఓపరికం కాలేజీ విద్యార్థి కుండదు ..... నీకూ లేకపోయింది! నీ ఆలోచన కొత్త పుంతలో నడుస్తున్నందుకు మిక్కిలి సంతోషం!

ఆ పుస్తకం పేరు 'ఆశాజీవి' అన్నావు. నువ్వు వూహించినట్టుగా అది నాకు చిరపరిచితమైన పుస్తకమే. కానీ ఆ రచయితను గురించిన వివరాలు నాకు పూర్తిగా తెలిసి ఉంటాయని భావించడంలో నువ్వు పొరబడ్డావని మాత్రం చెప్పక తప్పడం లేదు. ఎందుకంటే అతణ్ణి గురించి నీకెంత తెలుసునో నాకూ అంతే తెలుసు. అతడి పేరు నీలకంఠం! నీలకంఠుడనగా లోకానికి శివంకరుడైన ఆదిభిక్షువు.

నీకంఠమనగా ఎక్కడో నింగిపైన మబ్బులాడితే యిక్కడ నేలపైన పరవశించి పోయే నెమలి. నీలకంఠమనగా తన పిచ్చే తన కానందంగా కిచకిచ లాడుకుంటూ మామిడి తోటల్లో విహరించే కాటుకపిట్ట. నీలకంఠమనగా చూపుకు శంఖంలా తెల్లగా వుండి కొరకగానే నాలుకను చురుక్కుమనిపించే ముల్లంగి గడ్డ. ఇవన్నీ నిఘంటువు ద్వారా నాకు లభించిన వరాలు. పోగా అతడేం చేస్తుంటాడని ప్రశ్నించావు. వేరొకపని ఏదైనా చేయగలిగిన వాళ్ళు పుస్తకాలు వ్రాయడానికి పూనుకోరని నాకో అభిప్రాయం వుంది. ఎందుకంటే ఏపనిన చేయదలచుకున్నా అందుకు పదుగురి తోడ్పాటు అవసరం. హమేషా అద్దం చేతబట్టుకుని ఎవళ్ళ ముఖాలు వాళ్ళకే చూపించి విరోధాలు కొని తెచ్చుకునే స్వేచ్ఛా ప్రవృత్తి రచయితను ఏకాకిగా, మరేవిధమైన ప్రయోజకత్వాన్ని గానీ వెలగబెట్టడానికి వీల్లేని ఆశక్తుణ్ణిగా చేసి నిలబెడుతోంది. నీ కొండంత కుతూహలానికి పట్టెడు ఆహారమైనా పెట్టలేకపోతున్నందుకు నాకెంతో విచారంగా వుంది. నా ఓపినంతలో నేనొక చిన్న వర్తమానాన్ని మాత్రం తెలుసుకోగలిగాను. నీలకంఠం సీతానగరం వాస్తవ్యుడు. సదరు సీతానగరం చింతపండు బేరాసారాలకు ప్రసిద్ధి. విరుగగాచే మీ చింతచెట్ల పులుపు సరుకు బహుశా ఆ వూరికే ఎగుమతి అవుతుంటది. ఈ బాదరాయణ సంబంధాన్ని పురస్కరించుకుని నువ్వెప్పుడైనా సీతానగరం వెళ్ళడం తటస్థిస్తే, ఆ రచయితను గురించి మరికొన్ని వివరాలు తెలుసుకోవడం సాధ్యమౌతుంది......"

చింతపండు వ్యాపారంతో తాను ప్రమేయం పెట్టుకోవలసి రావచ్చు నన్న మిత్రుడి ఊహకు శ్రీపతి నవ్వుకున్నాడు. తామరాకుపై నీటబొట్టులా తన జీవితం సంసార తాపత్రయాలకు అంటీ అంటకుండా గడిచిపోతుందని అతడనుకునేవాడు. కానీ అలా జరుగలేదు. జరగకపోవడంలో విడ్డూరం గూడా లేదు. సిద్ధార్థుడంతటివాడు బుద్ధుడైన తర్వాత మళ్ళీ జనపదాల్లోకి తిరిగిరాక తప్పలేదు. సరిగా అలాగే శ్రీపతిగూడా వాస్తవిక ప్రపంచంలోకి దిగివచ్చి వివాహం చేసుకుని సంసారభారం భుజాలపైన వేసుకుని లౌకికవ్యాసంగాల్లో నిమగ్నుడు గాక తప్పిందిగాదు.

ఆహారహాలన్న రెక్కలు గట్టుకుని అదేపనిగా పరతెంచి పోసాగింది కాలం.

మిత్రుడి దగ్గరనుంచీ పైవిధంగా ప్రత్యుత్తురం లభించిన తర్వాత అయిదారేళ్ళకు గానీ శ్రీపతికి సీతానగరం వెళ్ళడం కుదరలేదు. మగపెళ్ళి వారు శ్రీపతికి దగ్గర బంధువులు. వివాహం కన్యాదాత స్వగృహంలో జరుగుతుంది. కన్యాదాత స్వస్థలం సీతానగరం. దూరాభారం కావడం వల్ల తానొక్కడు మాత్రమే బయల్దేరి వెళ్ళాడు శ్రీపతి. డబ్బు పలుకుబడీ సమపాళంగా కలిసివున్న భారీ అంతస్తు కుటుంబం ఆ సీతానగరం గృహస్తుడిది. అట్టహాసం పట్టపగలుగా జరిగింది పెళ్ళి. ఎటొచ్చీ క్రిక్కిరిసిపోయిన జనసమూహం నాలుగు గోడల మధ్య ఉడికిపోయిన మాట మాత్రం వాస్తవం. వర్షాకాలం జరుగుతున్నా ఈ వూళ్ళో ఎండలింకా పెళ్ళున కాస్తూనే వున్నాయి. ముహూర్త భోజనాలు పూర్తికావచ్చేసరికి ప్రొద్దు పడమటికి వ్రాలిపోయింది.

సందడినుంచీ కాస్తా దూరంగా వెళ్ళి చల్లటి పందిరి క్రింద గుంజకానుకుని కూర్చున్నాడు శ్రీపతి.

అల్లంతదూరంలో సుష్టుగా భోజనం చేసిన పెద్ద మనుషులిద్దరు భుక్తాయాస నివారణార్థం యిసుకపైన మేనువాల్చి తమ ఓపిక అనుమతించినంతలో మెల్లగా యిష్టాగోష్టి కొనసాగిస్తున్నారు.

పది పదిహేను నిముషాలవరకూ వాళ్ళ నలాగే మాట్లాడుకోనిచ్చాడు శ్రీపతి. ఆ తరువాత ఆ యిద్దరిలోను కొంత సౌమ్యుడుగా కనిపిస్తున్న పెద్ద మనిషి కేసి చూస్తూ తటాలున ప్రశ్నించేశాడు –

"ఏమండీ! మీదీవూరే ననుకుంటాను. నీలకంఠం గారిని ఎరుగుదురా మీరు?"

"ఏ నీలకంఠంగారండీ బాబూ! ఈవూళ్ళో వీధి వీధికీ ఒక నీలకంఠం వున్నాడు......"

"నా ప్రసక్తి రచయిత నీలకంఠం గారిని గురించి....." శ్రీపతి విశదం చేశాడు.

"రచయిత నీలకంఠమా! అతడికేమండీ, నిక్షేపంగా వుంటాడు. నిక్షేపమంటే ఏమిటంటారేమో? వేసిన దుస్తులు తీయడు. పెరిగిన గడ్డం గొరగడు. అరిగిన చెప్పులు విడువడు. అతగాడి దెప్పుడూ పైచూపు. ఎందుకలా చూస్తాడని ప్రశ్నిస్తే ఆకాశాన్ని సర్వే చేస్తుంటాడని చెబుతారు కొందరు! తానొకడితో మాట్లాడడు. అతణ్ణి మాటల్లో దింపేపాటి తీరిక ఇక్కడెవరికీ లేదు......"

"అంతేగాదండోయ్! ఒకసారేం జరిగిందో తెలుసా మీకు?" రెండో పెద్దమనిషి అందుకున్నాడు. "తన కుమారుడి పెళ్ళికి పంచరత్నాలు వ్రాసి యివ్వమని ఓ ఆసామి అతణ్ణి తగులుకున్నాడు. ఎదుటిమనిషికేసి ఎగాదిగా చూచి ఈయనగారు గబగబా పద్యాలు రాసిచ్చేశాడు. ఆ ఆసామికి తెలుగక్షరాలైతే తెలుసుగానీ వాటి కలయిక వల్ల కొన్ని అర్థాలు లేదా అనర్థాలు ఏర్పడవచ్చుచని తెలియదు. సరే, లగ్నానికి సరిగ్గా అచ్చాఫీసు నుంచీ ఆశీస్సు లొచ్చేశాయి. వాచ్చక చూద్దురుగదా, మొదటి పద్యానికి తాత్పర్యం యిది - నల్లబజారు వాణిజ్యంలో అల్లనల్లన దొడ్డిగుమ్మం గుండా యీ మహనీయుడి భవనంలోకి వచ్చిన ధనలక్ష్మికి, ఇంపైన యింటికి రాబోతున్న కొత్తకోడలికీ సపత్నీ మాత్సర్యం కలుగుకుండుగాక!.... ఆకాడికీ మిగిలిన పద్యాలతో పోల్చిచూస్తే మొదటిదే కాస్త నయం!".

గాలివానలో కొబ్బరిచెట్టులా కదిలిపోతూ ఆయన బిగ్గరగా నవ్వసాగాడు.

"నవ్వితే సరిపోయిందటయ్యా శేషావతారం! ఆ తరువాత జరిగిన సంగతేమిటో చెప్పవే నువ్వు! పోనీ, నేను చెబుతాను వినండి సార్! ఆ ఆసామి మాటకు మునిసిపాలిటీలో తిరుగులేదు. ఈ నీలకంఠం గారేమో రెండేళ్ళుగా యింటికి పన్ను కట్టలేదు. వాళ్ళు జప్తీకి రంగం సిద్ధం చేశారు. చెంబు, తప్పేలా లాంటివన్నీ బయటికి తీయించి పాడేస్తుంటే యీయన గుడ్లప్పగించి చూడసాగాడు. ఇలాంటివాణ్ణి కట్టుకున్న నేరానికి పెళ్ళాం లబోదిబోమని మొత్తుకోసాగింది. ఈ హఠాత్సంఘటనకు అర్థమేమిటో అంతుబట్టక పసివెధవ ఆమె కాళ్ళకు చుట్టుకున్నాడు. చూస్తూ నిల్చున్న వాళ్ళలో అయ్యో పాపమని నిట్టూర్చనివాడు పాపాత్ముడు. అ ంతటితో నైనా కథ ఆగిపోవచ్చుగదా! ఊహూ, ఆగిందికాదు. వాళ్ళెవరో ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థులట! దక్షిణాది దేవాలయాల సందర్శనానికి బయల్దేరి, దేవాలయంలాంటి దేదీ లేకపోయినప్పటికీ సీతానగరంలో దిగేశారు. ఎందుకు దిగారు బాబూ అని అడిగితే నీలకంఠం గారిని చూడాలన్నారు. చూస్తారు సరే, చూచి ఏం చేస్తారని అడిగితే కాసేపు మాట్లాడి ఆటోగ్రాఫూ తీసుకుంటామన్నారు. సరిగ్గా వాళ్ళు వెళ్ళిన సమయానికి వేలం పాట జరుగుతోంది....."

శ్రీపతి జాలిపడ్డాడు. అతడి జాలి ప్రధానంగా ఆ ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థులపైకి ప్రసరించింది. పాపం, అమాయకులు వాళ్ళు! నిరుపహతిస్థలంలో గాకపోయినా ఒకమాదిరి నివాసయోగ్యమైన యింట్లో నివసిస్తూ, రమణీప్రియ దూతిక తెచ్చియిచ్చే కప్పురపు విడెంగాకపోయినా బంకులో దొరికే మామూలు నాటురకం కిళ్ళీ అన్నా నములుతూ రచయితగారు తమకు భేటీ యివ్వగలరని ఆశించివుంటారు!

"ఇంతకూ ఆయనగారిని గురించి వాకబు చేయడంలో మీ ఉద్దేశమేమిటో చెప్పారు గారు...'

' పరేంగితాన్ని సాకల్యంగా ఆరాతీసినగాని విషయాంతరంలోకి వెళ్ళేటట్టు లేదు శేషావతారం గారు.

"అబ్బే - ప్రత్యేకంగా ఉద్దేశమేమీలేదు. ఊరికే అడిగాను...." నేరం చేసినవాడిలా తప్పించుకో జూచాడు శ్రీపతి.

"మీరాయనగారిని కలుసుకోదలచుకుంటే మాకేమీ అభ్యంతరం లేదు. అందుకోసం మీరు పెద్దగా శ్రమపడవలసిన అవసరం గూడా వుండదు. ఎందుకంటే ... ఈ వీధిగుండా అరమైలు దూరం నడిస్తే భీమారావు పార్కు. పార్కు కెదురుగానే వుంది సెంట్రల్ లైబ్రరీ. రివాజు తప్పకుండా ప్రతి రోజా లైబ్రరీ ఉద్యోగులకు స్వాగతం చెప్పే హానరరీ ఉద్యోగం నీలకంఠం గారిది. ఎలాగూ యిదివరకే నేను ఆయనగారిని ఆకారాన్ని గురించి చిన్న స్కెచ్ యిచ్చేశాను. ఇకపైన మీరు చేయవలసిందల్లా ఒక్కటే! ఒక్కనిముషంపాటు పుస్తకంలోకి చూచి అంతలో మరిచిపోయిన విషయమేదో జ్ఞప్తికి వచ్చినట్టుగా తల పైకెత్తి పైకప్పుకేసి చూస్తూ ఎడతెగని ఆలోచనలో మునిగిపోయిన పాఠక మహాశయుణ్ణి వెదికి పెట్టుకోగలిగిత చాలు! ఆ వాలకమే మీకు ఆనవాలు!"

మరికొంతసేపు మాట్లాడివుండేవారే శేషావతారంగారు! కానీ మాట్లాడుతుండగానే ఆయన కళ్ళల్లో నుంచీ నిద్రాదేవత తొంగి చూచింది. అడపాదడపా ఆమెకు ఆవులింతలలో నీరాజనాలిస్తూ ఆయన ప్రసంగాన్ని కొనసాగించారు. చివరికింక నిద్రాదేవత ఎదుట మంత్రోచ్చారణ పనికిరాదనుకున్నారేమో, ధ్యానసమాధిలో మేను మరిచిపోయారు.

నిజానికి శ్రీపతి పరిస్థితి గూడా శేషావతారంగారికన్నా మెరుగ్గా లేదు. గడిచిన రాత్రి రైలు ప్రయాణంలో నల్లుల్ని ఉసికొలిపి ఆరోగ్యవంతమైన రక్తంతో వాటికి మృష్టాన్నాలు సమకూర్చి అందుమూలంగా సొమ్మసిల్లిపోయిన శ్రీపతి శరీరం విశ్రాంతిని అభిలషించడంలో ఆశ్చర్యంగూడా లేదు. పెళ్ళి విడిదిలోకి వెళ్ళి శ్రీపతి పరుపుచుట్ట విప్పుకున్నాడు. పడుకోబోతూ కునుకుదీసి లేస్తే చాలు ననుకోవడం తప్పా అతడు మరే పాపమూ ఎరుగడు! అక్కడా యిక్కడా వెదికి ఆఖరుకు విడిదిలో నిద్రపోతున్నాడని తెలుసుకుని పొగలెగసిపోతున్నా కాఫీ పానీయంతో సహావచ్చి పెళ్ళిపెద్దలు స్వయంగా కలుగజేసుకునేదాకా అతడు గాఢ నిద్రలో అవశుడై వుండిపోయాడు.

ప్రొద్దుపోయి చీకటి పడుతోంది.

శ్రీపతి గడియారం చూసుకున్నాడు. గంట ఆరున్నర కావస్తోంది.

ఆదరా బాదరా భీమారావు పార్కువైపుగా నడవసాగాడు శ్రీపతి. నడుస్తూ నడుస్తూ ఆకసంవైపు చూచాడు. దట్టంగా మేఘాలు క్రమ్ముకుంటున్నాయి. వానలో తడవకుండా విడిదికి తిరిగి వెళ్ళడం సాధ్యంకాదేమో! ఐనా ఫరవాలేదు. ఒకరోజు వానలో తడిసినంత మాత్రాన మనిషి మొలకెత్తిపోడు....

శ్రీపతి గమ్యస్థానం చేరుకునేసరికి గంట ఏడైనందుకు గుర్తుగా మాదాగుడిలో గంటలు మ్రోగుతున్నాయి.

చాలా పెద్దది భీమారావు పార్కు. దానికెదురుగా రెండంతస్తుల భవనమే గ్రంథాలయం. శ్రీపతి వడివడిగా లోపలికి వెళ్ళాడు. గదులన్నీ గాలించేశాడు. హాల్లోకి వచ్చాడు. చీమచిటుక్కుమంటే వినిపించే నిశ్శబ్దం. పాఠకులు పత్రికాపఠనంలో నిమగ్నులు. అటెండరు శ్రీపతిని సమీపించి ఏదో రహస్యం చెబుతున్నట్లుగా "దేనికోం వెదుకుతున్నారు బాబూ! పుస్తకమేదైనా కావలిస్తే పైకి వెళ్ళండి' ' అన్నాడు.

"ఎలా వెళ్ళాలి?" అన్నాడు శ్రీపతి.

"అదిగో, అటువైపు వసారాలోనుంచీ మెట్లున్నాయి."

వసారాలోకి వెళ్ళిన శ్రీపతి మెట్లెక్కబోతూ ఆగిపోయాడు.

మాసిపోయిన పవనాలతో, దొరకని వస్తువుకోసం వెదికి వెదికి అలసిపోయినట్టున్న కళ్ళతో రేగిన జుత్తుతో ఓ వ్యక్తి మెట్లు దిగుతున్నాడు.

శ్రీపతి పెదవులు కంపించాయి. పలకరించకపోయినా పలకరించినట్టే భ్రమించాడు. ఏవో మాటలు అతడి గొంతుకలో తగులుకొని గిలగిలలాడిపోయాయి. తానెవరికోసమైతే యిక్కడికి వచ్చాడో ఆ నీలకంఠం గారు ఈయనే కావచ్చు నన్న ఊహతో అతడు యించుమించుగా స్తబ్ధుడైపోయాడు.

ఈ లోగా మెట్లు దిగిన వ్యక్తి ముందుకు సాగి సింహద్వారాన్ని సమీపించాడు.

శ్రీపతి బుర్రలో తటాలున ఓ మెరుపు మెరిసింది. సాధారణంగా సింహద్వారం దగ్గర పాఠకులు తమ సంతకాలు నమోదుచేసి వెళ్ళే రిజిస్టరు ఒకటి వుంటుంది. నియమాన్ని తోసిరా జనకుండా బయటికి వెళ్ళిపోతూ ఈయన గనుక అందులో సంతకం చేస్తే తన అనుమానంలోని నిజానిజాలేపాటివో తేల్చుకోడానికి వీలుంటుంది.

శ్రీపతి చరచరా ముందుకు నడిచాడు. బల్లపైన తెరచిపెట్టివున్న రిజిష్టరు పైకి అతడికంటే ముందుగా అతడి చూపులు తూపుల్లా దూసుకుని వెళ్లాయి.

"నీలకంఠ:" - అదే చిట్ట చివరి సంతకం.

"బాబ్బాబూ! చేవ్రాలు చేసివెళ్ళండి" అన్న అటెండరు మాటలు శ్రీపతికి వినిపించనేలేదు. అపరాధిని వెన్నంటిని పత్తుదారుడిలా అతడు రోడ్డుపైన నీటకంఠాన్ని వెంబడిస్తున్నాడు.

వెంబడిస్తున్నాడే గానీ వెంబడించి తాను చేయవలసిందేమిటో శ్రీపతికి తోచడం లేదు. అయ్యా, నీలకంఠం గారు మీరేనా అని అడిగితే ఏం - నేను నీలకంఠం కాగూడదా అంటాడేమో! నేను మీ పుస్తకాలు చదివాను అంటే, మీకు శ్రమ కలిగించినందుకు క్షంతవ్యుణ్ణి అంటాడేమో! రచయితలను గురించి రకరకాల గాథలను విని ఎట్టి పరిస్థితిలోనూ వాళ్ళు సామాన్య మానవులకు మల్లే ప్రవర్తించరంటూ దురభిప్రాయాన్ని ఏర్పరచుకున్న మంచి పాఠకుడు శ్రీపతి! అన్నీ సందేహాలే అతనికి!

ఏదో అదృశ్య శక్తి భూమివైపుకు లాగి పట్టుకున్నదిగానీ లేకుంటే ఈపాటి కెప్పుడో తేలిపోతూ వుండవలసినంతటి బక్కపలచటి మనిషి నీలకంఠం! వ్యక్తిత్వంలో శరీరబలం కన్నా ఆత్మ విశ్వాసం పాలు హెచ్చుగా సమ్మిళితమైన వ్యక్తులు కొందరు నిద్రాహారాలు సరిగా లేపోయినా, సుఖసంతోషాలు మృగ్యమై, పరిస్థితు లెంతగా ప్రతికూలించినా మొండిగా జీవితంతో పంతమాడుతూ కూర్చోగలరు. నీలకంఠం అలాంటి వారికోవకు చెందినవాడేమో? ఆలోచనలతోబాటుగా సాగిపోతున్నాడు శ్రీపతి.

శ్రీపతి ఎంతగా అడుగులు సాచివేసినా పిలుపుకందనంత దూరంలో వున్నాడు నీలకంఠం. పడమటి దిక్కునుంచీ జిల్లుమని వీస్తున్న చల్లటి గాలిలో, అప్పుడే ప్రారంభమై అంతలోనే పుంజుకుంటున్న తుంపర చినుకుల్లో, మాసిన గడ్డాన్ని రేగిన జుత్తును ఎడమచేతి వ్రేళ్ళతో పరామర్శించుకుంటూ, మురికి పేటల్లోని సందుగొందుల్లోపడి అతడు చక్కా ముందుకు వెళ్ళిపోతున్నాడు.

ఉండివుండీ బిగ్గరగా వినిపిస్తూ చేరువకు వస్తున్న నగారాల మ్రోతలా గాలితో కలిసిన వాన అంతకంతకూ ఉద్ధృత మౌతోంది.

కాకిని వ్రేలాడగట్టినట్టున్న ఈ కటిక చీటకిలో నీలకంఠంగారిని యిలా వెంబడించడం వల్ల తనకు కలుగబోయే ప్రయోజనమేమీ లేదని శ్రీపతికిబాగా తెలుసు! కానీ అంతరాంతరాల్లో దాగివుండిన బలమైన ఆకాంక్ష ఏదో వెన్నంటి తరుముకొచ్చినట్లుగా తనింతదూరం నడిచివచ్చేశాడు. వచ్చినంత దూరం తిరిగి వెళ్ళడం తప్పా తనకిందువల్లనష్టమయ్యేదేమీలేదు. కానీ బొట్టూ కాటుకా పెట్టి పిలిచినట్టుగా యింతలో ఈ వాన ఒకటి ప్రారంభమై పోయింది.

అంబుదాల రూపంలో ఆకాశంలో పడివుండలేక కరిగి కరిగి నేలపాలై పోతున్న వరుణ దేవుణ్ణి, వానలో తడిసి తడిసి ముప్పందుమై పోతున్న నీలకంఠంగారిని వాళ్ళ రాతకొద్దికీ వదిలిపెట్టి తలచాటుకోసం తనకొక ఆశ్రయాన్ని వెదుక్కోసాగాడు శ్రీపతి.

ఆ క్షణంలో ఓ మెరుపు మెరిసింది. వాయవ్యంగా పైకెగ బ్రాకుతూ గిరుక్కున ఈశాన్యదిశకు మరలిన ఆ మెరుపుకు మల్లే నీలకంఠం గారి నడకలో సైతం ఓ మలుపు పొడసూపింది. వీధికి కుడివైపుగా వున్న పెంకుటింటికి అభిముఖంగా తిరిగి తయన చరాలున లోపలకి వెళ్ళిపోయాడు.

తడిసిపోయి, గాలికి చెదిరిపోయిన ముంగురుల్ని వెనక్కు సర్దుకుంటూ ఆ పెంకుటింటి వైపు చూచాడు శ్రీపతి. చీకటిలో స్పష్టంగా తెలియడంలేదుగానీ ఆ యింటిలో వసారాగూడా వున్నట్టుంది. తలదాచుకోడానికి అంతకుమించిన శరణ్యాం చుట్టుప్రక్కల మరెక్కడా కనిపించడం లేదు. నాలు గంగల్లో ఆ వసారాలోకి వెళ్ళి నిల్చున్నాడు శ్రీపతి.

అది మూడంకణాల పెంకుటిల్లు. చివరి అంకణంలో నుంచీ యింటి లోపలికి దారి. వసారాలో మిగిలిన రెండంకణాల మేరకు పెద్ద అరుగు. అరుగు పైన నిల్చుంటే తెరిచిన కిటికీ గుండా గృహాంతర్భాగం కనిపిస్తుంది. ఈ కిటికీ ఏ గదిలోకైతే తెరచుకుంటుందో ఆ గదిలోని దిగుడులో ఓ బుడ్డీదీపం వెలుగుతోంది. గాలిలో ఊగిసలాడిపోతున్న ఆ దీపశిఖకూ దాన్ని చుట్టుముడుతున్న అంధకారానికీ జరుగుతున్న సంఘర్షణలో ఆ గదిలోని వెలుగు చీకట్లు నల్లటి బూజుతో మసిబారిపోయినట్లున్న పైకప్పు మీద, వాననీటి చారికలతో వాతలు వేసుకున్న గోడలపైన వికటనాట్యం సలుపుతున్నాయి. గదిలో చెప్పుకోదగిన వస్తువులేవీ లేవు. ఒకటి రెండు కొయ్య పెట్టెలు. దండెం పైన పాతగుడ్డలు. తలుపులు లే అలమారా నిండుకూ పుస్తకాలు. కానైతే వాటివాటి యధాస్థానాల్లో వున్న ఆ వస్తువులేవీ శ్రీపతి దృష్టిని ఆకర్షించలేకపోయాయి. ఆశ్చర్యమేమిటంటే తమతో తామొక సమావేశం జరుపుకుంటున్నట్టుగా వంటింట్లో వుండవలసిన కంచాలు, గిన్నెలు, పళ్ళేరాలలాంటి పాత్ర సామానులన్నీ ఆ గదిలో ఎక్కడబడితే అక్కడ సర్దుకుని కూర్చున్నాయి. ఉద్దేశరహితగా అవి అక్కడ అలా సమావేశం జరపడం లేదన్న విషయం శ్రీపతికి రెండు క్షణాల్లోనే విశదమైంది. ఒక చిన్న జలాశయంగా రూపొందిపోయే ప్రమాదం నుంచీ ఆ గదిని రక్షిస్తూ ఆ పాత్ర సామానులు పైకప్పునుంచీ ఎడతెగకుండా జారుతున్న జలధారలను తమతమ ఉదరాల్లో నిలవచేసుకుంటున్నాయి.

బుడుంగుమన్న శబ్దంతో గిన్నెల్లోకి బూరి, బుడగలుగా పైకిలేచి వెంటనే చిట్లిపోతున్న జలబిందువుల తమాషాను పరికిస్తూ గదిగుమ్మానికావల నడిప్రాయం స్త్రీమూర్తి గోడకానుకుని నిల్చుంది. గుమ్మానికీవల పదేళ్ళ కుర్రాడు బాహ్య ప్రపంచంలో చెలరేగుతున్న ప్రకృతి బీభత్సాన్ని గురించి రవంతైనా పట్టించుకోకుండా దీపకాంతి గుడ్డిగా ప్రసరిస్తున్నచోట పుస్తకం తెరచి పట్టుకుని గడగడా పద్యాలు చదివేస్తున్నారు.

ఒంటినిండుకూ సరిపోని చీర, మాసికలుపడిన రవిక, నుదుట కానీ కాసంత కుంకుబొట్టు, పెదవులు విడివడితే మాటలే వినిపిస్తాయో, ఏడుపే ప్రారంభమౌతుందో ఊహించడం కష్టం! ఒక్కమాటలో చెప్పాలంటే ఆమె మూర్తీభవించిన దైన్యాంలా వుంది. కుర్రవాడు తొడుక్కున్నది పొట్టి నిక్కరు. నిక్కరుకు పైన అనాచ్ఛాదితంగా వున్న వాడి శరీరం వడగాలిలో పూలతీగలా కంపించిపోతోంది.

"ఇల్లంతా ఉరుస్తోందా ఏమిటి?" ప్రశ్నిస్తూ గుమ్మం ఎదుటకు వచ్చేశాడు నీలకంఠం గారు.

పరధ్యానంలో అడుగుల చప్పుడైనా వినిపించలేదేమో, ఆమె ఉలికిపడింది. కన్నెత్తి భర్తవేపు చూచింది. ఆ చూచిన క్షణంలో ఆమె కళ్ళల్లో కెంపుజీర రివ్వున ప్రాకింది.

అరుగుపైన నిల్చున్న శ్రీపతి చీకటిలోకి తప్పుకున్నాడు.

"అబ్బే, మన యిల్లు ఎక్కడైనా ఉరుస్తుందటండీ! ఉరవనే వురవదు. లేదంటే మరికొంత కాలం గడిస్తే, అప్పుడు గూడా యిలాగే వానలు కురిస్తే ఈ యిల్లు యిల్లంతా చెరువై పోతుంది. అంతకన్నానా! కాపురం చేస్తున్న యింట్లోనే ఈతలాడుకునే భాగ్యం ఎవరికి కలగాలండీ!"

అవి వట్టి మాటలు కావు. గుండెల్లో గూడుకట్టుకున్న ఆవేదనకు శబ్దరూపమైన అనువాదం అది. కానీ ఆ గోల నీలకంఠం గారి చెవులదాకా ప్రాకివచ్చినట్టు లేదు. ఆయన గదిలోకి తొంగిచూస్తూ "అరరే, గోడలన్నీ తడిసిపోతున్నాయి పార్వతీ!" అన్నాడు.

"అప్పటికీ ఈ గది ఎంతో నయం! వాన ప్రారంభమైన కొంతసేపటికే వంటగది జలమయమై పోయింది. పోతే పోయింది? మధ్యాహ్నం నుంచీ వెచ్చగా పొయ్యిలో పడుకున్న పిల్లి లేచిపోవలసి వచ్చినందుకే నా చింత?"

"అదేమిటి పార్వతీ ప్రకాశాని కింకా బువ్వ పెట్టలేదన్నమాట?" దీనంగా అడిగారు నీలకంఠం గారు.

"బువ్వ! అవ్వా, ఎంతమాటన్నారండీ మీరు! అదెక్కడ దొరుకుతుంది? ఐనా మిమ్మల్నని ఏం లాభం? నే నడిగివచ్చిన అదృష్టం అలాంటిది. కాకపోతే మధ్యాహ్న మనగా బయటికి వెళ్ళినవారు, ఊరంతా తిరిగి రూపాయి పుట్టించలేకపోయారటండీ! రూపాయి డబ్బులిస్తే శేరు బియ్యం దొరుకుతుంది. ఎలాగూ యింట్లో ఉప్పురాళ్ళు వుండనే వున్నాయి. ఇంత బియ్యం వుడకేసి రెండు లోటాలు కలిపిస్తే త్రాగి కుర్రసన్యాసి కిమ్మనకుండా నిద్రపోతాడు. ప్రక్కింట్లో రిక్షా వాడున్నాడు. పూటపూటకూ కారం తగలకపోతే ముద్ద దిగదు. ఎదురింట్లో అప్పలనరసమ్మ వుంది. ఆవిడ రాజ్యాలేలదు. దోసెలు చేసి అమ్ముకుంటుంది. ఐనా వున్నంతలో ఆటోపంగా బ్రతుకుతుంది. ఎటొచ్చీ లోకంలో మరెక్కడాలేని దరిద్రమంతా ఈ నాలుగు గోడల్లోపలే ఠికాణా వేవుకుని మీ గొంతుకూ నా గొంతుకే చుట్టుకుని కదలనంటే కదలనని మారాం చేస్తోంది....'

మరు నిముషంలో వీధి తలుపు తటాలున తెరచుకుంది. సుడిగాలిలా ఎగిరిపోతున్న ఎండుటాకులా నీలకంఠం గారు బయటపడ్డారు. ఏదో నిర్ణయానికి వచ్చినట్టుగా మళ్ళీ వానలో తడిసిపోతూ ఆయన ఊళ్ళోకి వెళ్ళిపోయారు.

అరుగుపైన ముసరుకున్న చిమ్మ చీకటిలో తనూ ఒక చీకటి ముద్దలా కలిసిపోయిన శ్రీపతిలో మాత్రం చలనం లేదు. అతడి బుర్రలో స్పష్టమైన ఆకారాన్ని మలచుకొని ఆలోచనలేవో రొదచేస్తున్నాయి. నీలకంఠం గారిని వెంబడించినందుకు ఫలితంగా తానీ జగన్నాటకంలోని ఒకానొక అంతర్నాటకాన్ని కళ్ళజూడగలిగాడు. చూచిన ప్రతి నాటకానికీ యథోచితంగా ఎంతో కొంత విరాళం ముట్టజెప్పడం తన వాడుక. యధార్థమైన జీవితం నాటకంపాటి చేయకపోదు. నీలకంఠం గారి కుటుంబానికి తనేదైనా సహాయం చేయగలిగితే, అంతకంటే తనకు ఆనందప్రదమైన విషయం వేరొకటి వుండదు. కానీ నీలకంఠంగారు ముఖం మేరుకైనాలేని తనబోటి అపరిచితుడు చేయదలచుకున్న సహాయాన్ని అంగీకరించే మనిషిలా లేరు....

శ్రీపతి మనసులో అంకురించిన సదుద్దేశానికి భగవంతుడి ఆమోదముద్ర గూడా లభించినట్టుగా అప్పుడొక సంఘటన జరిగింది. వానచేస్తున్న ఆగడం కాస్తా తగ్గి, అది తగ్గినంత మేరకూ గాలి విజృంభించింది. ఒక్కపెట్టుకన కిటికీగుండా చొరబడిన గాలి తాకిడికి గదిలోని బుడ్డిదీపం గుప్పున ఆరిపోయింది.

జేబులోనుంచీ పర్సును పైకి తీశాడు శ్రీపతి. లోపలి సొరుగులోనుంచీ అయిదు వంద రూపాయల నోట్లు పైకొచ్చాయి. అయిదింటినీ చుట్టగా జుట్టి కిటికీగుండా గదిలోపలికి జారవిడిచేశాడు శ్రీపతి.

తలపైన్నుంచీ కొండంత బరువును క్రిందకి దించుకున్నంత సంతృప్తితో శ్రీపతి వీధిలోకి వచ్చేశాడు. ప్రకృతిలో పూచి పరిమళించె పుష్పసమూహం లాంటిది డబ్బు. భగవంతుడి పూజలో వినియోగమైన పువ్వులకు మల్లే, యితరుల మేలుకోసం వినియోగింపబడిన డబ్బుకు కూడా చరితార్థత లభిస్తుంది. అంతేగాదు. నైతిక కర్తవ్యాన్ని నిర్వహించిన సంతృప్తి దారిప్రక్కన వెలుగుతున్న దీపంలా మానవుడి జీవనపథంలో కాంతులను చల్లుతుంది. శ్రీపతి కిప్పుడెంతో ఆనందంగా వుంది. సమయానికి ఆ ఉద్దేశం గనుక తనకు స్ఫురించకుండినట్లయితే, నీలకంఠం గారికి సంబంధించిన తలపుల బరువునుంచీ తన కీ జన్మలో విముక్తి లభించేది గాదు. చీకటిలాంటి నిప్పచ్చరాన్ని చీల్చిచెండాడే ఉషఃకిరణ పుంజంలాంటిది డబ్బు! దారిద్ర్య మహావృక్షం పాలిటికి నిశిత కుఠారంలాంటిది డబ్బు! దానితో వాళ్ళు ఆ యిల్లు బాగుచేసుకోవచ్చు. ఆ పసివాడికి రెండు జతల దుస్తులు కుట్టించుకోవచ్చు. ఇతరత్రా ఆర్జన లేకపోయినా అయిదారు మాసాలవరకూ నిశ్చింతగా సంసారం సాగించుకోవచ్చు....

కానీ తాననుకున్నదల్లా అనుకున్నట్టే జరుగుతుందని భావించే మానవుడు నిజంగా అల్పజ్ఞుడు. అనాగత విషయాలకు సంబంధించినంతవరకు మానవుడి ఊహాగానం గురించి బారెడు దూరపైపోయి వెక్కిరించినట్టుగా పళ్ళికిలించడం మానవ చరిత్రంలో ఎక్కడబడితే అక్కడ గోచరించే పరమ సత్యం. శ్రీపతి ఊహకు సైతం అలాంటి దుర్దశే వాటిల్లింది.

అతడు చేయదలుచుకున్న మేలు విధి చూచిన చిన్న చూపువల్ల కీడుగా వికటించింది -

## 2

నీటకంఠమని చెబుతే ఎవ్వరికీ తెలియదు. ఆ ప్రాంతంలో అతడు 'నీలూ' అన్న పేరుతో వ్యవహరింపబడేవాడు. అతడి మాతృభాష ఏమిటో తెలియదు. తప్పుల తడకల హిందీ మాట్లాడేవాడు. ఎవరైనా అడిగితే తాను దక్షిణాది వాడినని చెప్పుకునేవాడు. విశాల భారతదేశంలో కడుపు చేతబట్టుకుని ఒక మూలనుంచీ మరొక మూలకు వలసవెళ్ళేవాళ్ళు కొకొల్లలు. ఆవిధంగా తరలివచ్చిన వేలకొలది నిరుపేదలకు ఆశ్రయమిచ్చి వీలైనంతలో వాళ్ళ జీవితాలవసరాలను గమనిస్తున్న గొప్ప పారిశ్రామిక కేంద్రం అది. ఇతడు ఫలానా వాడని నిర్దేశించడానికి వీల్లేకుండా అసంఖ్యాక ప్రజానీకంలో కలిసిపోయాడు నీలూ. కష్టాలతరంగాల పైన, నష్టాల తిమింగలాల మధ్య చేతుల బలంతో జీవిత సాగరాన్ని తరించడానికి ప్రయత్నిస్తున్న మానవుల్లో నీలూ కూడా ఒకడు. అంతకుమించిన పరిగణనను అతడు ఆశించనుగూడా లేదు.

యంత్ర భూతాలకు సేవలు అవసరంలేని తీరిక సమయాల్లో పొగగొట్టాల పట్టణంనుంచీ బయటపడి నిర్జన ప్రదేశంలో ఏ చెట్టు క్రిందనైనా కూర్చునేవాడు నీలూ. పైన వినీలాకాశం! అది అక్షరాలు లేని కాగితం లాంటిది. గడ్డకట్టి చలన ముడిగిన సముద్రం లాంటిది. మరింత సూటిగా చెప్పాలంటే ఈనాటి తన జీవితం లాంటిది. కాలపురుషుడు ఉతికి ఆరవేసుకున్న నల్లటి దుప్పట్లలా నీలూ అలా కూర్చునివుండగానే చీకటి తెరలు దిగసాగేవి. చీకటిపడినకొద్దీ దృగ్గోచరం కాసాగే తారకలకు మల్లే ఏవో కొన్ని పూర్వ స్మృతులు అతడి హృదయాన్ని కెలికివేయసాగేవి. దట్టంగా చుట్టుముట్టిన చీకటిలోనుంచీ తన చేతులవైపు చూచుకునేవాడు నీలూ. ఒకప్పుడవి వ్యాసంగానికి అంకితమైన చేతులు. ఇప్పుడు ముంజేతుల్లో పచ్చటి నరాలు పైకి లేచాయి. అరచేతులు రాతిలా బిగుసుకుపోయాయి.

వ్రేళ్ళు కడ్డీల్లా తయారై గరుకుబారిపోయాయి. నీలూ కళ్ళు ఆర్ద్రమైపోయేవి. కలిమిగారాలు బిడ్డలైన జయంతాదులు శబరార్భకుల వెంట తిరుగుతున్నారని చెప్పుకుంటూ విలపించారు దేవతలు. తన దురవస్థకు కటంతడిపెట్టే వాళ్ళెవరున్నారు?

ఎవ్వరూ లేరు!

అసలీ ప్రపంచంలో తన కెవ్వరూ లేరనీ, ఉన్నా వాళ్ళలో తనకిక అనుబంధాలు లేవనీ అనుకున్నాడు నీలూ. ఆకారణంగా అలాంటి నిర్ణయానికి రావటానికి నీలూ పిచ్చివాడు కాదు.

నూకలు దొరక్కపోయినా భావాలమేకలు కాస్తూ తాను కాలం గడిపాడు. మిట్టమధ్యాహ్నం కావస్తున్నా యిన్ని కాఫీ నీళ్ళతో గొంతుక తడిచేసుకోడానికి వీలులేని పరిస్థితుల మధ్య బ్రతుకుతూ భావమహోదధిని మధించి అడగనివారిది పాపంగా అమృతం పంచిపెట్టాడు. అలాగని తానెన్నడూ దారిద్ర్యాన్ని కంటగించుకోలేదు. ఆ మాటలకొస్తే ఆకలితో ప్రేవులు ఆక్రోశించినప్పుడు, అప్పులవాళ్ళు తోడేళ్ళలా వెంట తగులుకున్నప్పుడు, తన ఆవేదన సర్పాల్లా మనస్సును పరిష్వంగం చేసుకున్నప్పుడు గుండెల్లో జిజ్జిబోతున్న భావాలు మేలుకునేవి. నిస్సందేహంగా తాను చేస్తున్న దొక పవిత్ర కార్యం. ఏ తత్కార్యనిర్వహణలో ఎలాంటి ఒడుదుడుకు లెదురైనా సరే తను వాటిని సరకుచేయడు. అందాకా బాగానే వుంది. కొండ కొమ్మలాంటి ఆ ఆదర్శం పైన కొలువుతీర్చి కూర్చున్నంతకాలం అదొక పవిత్రమైన తన్మయభావం తన నాదేశించింది. మంచినీటి కుంట దగ్గిరి పొదలో పొంచి కూర్చున్న ముప్పన్నెమెకంలా, తన తన్మయత్వాన్ని పటాపంచలు చేయడానికి ఒక దుర్ఘటన కాచుకుని వుందన్న విషయం తన కప్పట్లో తెలియదు!

తన బుద్ధికి భాసించనిదీ, ఆ నాటివరకూ కలలోనైనా తన ఊహకందనిదీ అయిన ఆ దుర్ఘటన ఎలాంటిది?

ఎలాంటిదైతేనేమి! దానికి తాను కృతజ్ఞుడు. అది తన కళ్ళను తెరిచింది గనుక!

- ఈ ప్రపంచం తుచ్ఛమైనది. ఈ మనుషులందరూ దగాకోర్లు. నీతీ, న్యాయం, ధర్మం, అనురాగం, మమకారం లాంటివన్నీ కల్లబొల్లి కబుర్లు. సంగీతసాహిత్య చిత్రలేఖనాది కళలు సమస్తం, తమ తమ విషయ వాంఛలను నెరవేర్చుకోడానికి వీల్లేని తీరికవేళల్లో మానవుల ఉబుసుపోకకు ఉపకరించే శుష్కవ్యాసంగాలు! ఈ ప్రపంచంలో ఆసించవలసిందీ, ఆర్జించవలసిందీ, ఆరాధించవలసిందీ ఒక్కటే ఒక్కటి. అదే డబ్బు! డబ్బు చేతిలోలేని పక్షంలో దిబ్బలో మెదిలే కుమ్మరిపురుగు సైతం నిన్ను మౌనంగా చూస్తుంది.

అది తన ఆదర్శాల విలువలను తల్లక్రిందులు చేసిన దారుణమైన సత్యం! కానీ అది తనకు తెలిసిరావడం ముఖ్యంగాదు. ఎలా తెలిసింది. ఎవరి మూలంగా తెలిసింది - అన్న విషయమే ముఖ్యం.

అగ్నిసాక్షిగా తాను అంటి బొట్టుగట్టిన భార్య పార్వతి. ఐహిక సుఖాలు మీసాలపైన తేనెల. సుఖాల సోఫాలపైన కునికిపాట్లు పడడం తన ధ్యేయం కానేకాదు. తన ఆశయాన్ని అర్థం చేసుకునేపాటి యింగితజ్ఞానం పార్వతికి వుంటుందనే తాను భావించాడు. ఆ భావన పొల్లు!

జరిగిందిది - ఎందుకో పెట్టెను తెరిచాడు. అది తరచుగా తాను తెరచిచూచె పెట్టెగాదు. పెట్టె అట్టడుగున పుస్తకంలో నోట్లు కనిపించాయి. ఒకటి రెండూ కావు. అయిదు వందల రూపాయల నోట్లు! అమావాస్య నిశీధంలా నెలరాజు కనిపిస్తే, పాడువారిన గుడిలో సుప్రభాతం వినిపిస్తే ఎవరికి మాత్రం ఆశ్చర్యం కలగదు? తన కళ్ళను తానే నమ్మలేక పోయాడు.

జవాబు చెప్పుకోవలసి వచ్చిన పార్వతి ముఖంలో కత్తివేటుకు నెత్తురు చుక్కలేదు. ఆవిడ

తబ్బిబ్బు పడిపోయింది. ఆమె నోటివెంట వచ్చిన కుంటి జవాబు తన సందేహాన్ని తుడిచిపెట్టలేక పోయింది. వాన వచ్చిన రాత్రట! కిటికీకి ఇవతలగా నేలపైన ఈ నోట్లు పడివున్నాయట అడపాదడపా వర్షాన్ని ప్రసాదిస్తాడంతేగానీ వరుణదేవుడు కరెన్సీ నోట్లు తీసుకువచ్చి తెరచిన కిటికీగుండా లోపలికి వెదజల్లడు. అలాగైతే ఈ డబ్బు యింటి లోపలికి ఎలా వచ్చింది?

ఐనా ఏమని జవాబు చెప్పగలుగుతుంది పార్వతి? చేసిన చెడుచెయిదం పండిన పాపంలా బయటపడిపోగా వెక్కివెక్కి ఏడువసాగింది. ఏడుపులో మళ్ళీ బుకాయింపు! - 'నా మాటపై నమ్మకం లేదటండీ! పది పన్నెండేళ్ళుగా మీతో కాపురం చేసినదాన్ని. యిదేనా మీరు నన్నర్థం చేసుకున్న తీరు? మీకు తెలిస్తే డబ్బు దుబారా ఖర్చుపాలై పోతుందని యిలా భద్రంగా దాచిపెట్టాను. ఒట్టుపెట్టుకుని చెబుతున్నాను. నేను మరే పాపమూ ఎరుగపను' అంటూ వాపోయింది. ఐతే తాను లోకమనుకున్నంత భోళారాయుడు కాదు. ఒక ఆడమనిషి స్వప్రయోజకత్వం ద్వారా యింత డబ్బు వెనుకవేయగలిగిందంటే అందుకావిడ అవలంభించిన పద్ధతులు ఎలాంటివై వుండవచ్చునో వూహించలేనంతటి వెర్రివెంగళప్ప కాడు. యుద్ధపు మారణహోమంలో మూలబలమంతా మ్రగ్గిపోగా ఏకాకిగా మిగిలిపోయిన రాజ్యాధిపతిలా తను కృంగిపోయాడు. తన ఆశయాలకిక అర్థంలేదు. తన ఆదర్శాలకింక విలువ లేదు. తన బ్రతుకులోని నీతీ, నిజాయితీ ఘోరాతి ఘోరమైన అవమానానికి గురైన తర్వాత తానీ యింటి కప్పుక్రింద నివసించలేడు. ఈ ఆడదాని ముఖం చూడలేడు. పతితతో కాపురం చేయలేడు!

ఒక్క సంసారం పట్ల మాత్రమేగాదు, ఆ సంసారాన్ని యిలాంటి అధ్వాన్నమైన స్థితికి తీసుకువచ్చిన రచనా వ్యాసంగంపట్ల గూడా తనకు ఏవగింపు కలిగింది. ఇకమీదట తాను రచయిత కాడు. రచయిత నీలకంఠం చనిపోయాడు. ఇల విశాల. ఒక్క మానవుడు బ్రతకదలచుకుంటే అందుకొక వెరవు కనిపించక పోదు....

సిద్ధార్థునితో పోల్చుకోడానికి తనెంతటివాడు? కానీ తనకు సంబంధించినంత వరకూ అదే మహాభినిష్క్రమణం!-

ఎప్పుడు లేచినా రాళ్ళవంక దగ్గరే తెల్లవారినట్టుగా సాధారణంగా అతడి ఊహాప్రవాహం యిక్కడ ఆగిపోయేది. తటాలున పైకిలేచేవాడు నీలూ. తలవంచుకుని నగరాభిముఖుడై నడక సాగించేవాడు.

గాలికదలని కట్టడాల్లో పావురాళ్ళ గూళ్ళలాంటి చిన్న చిన్న గదుల్లో గదొకొక్క కాపురం చొప్పున నివసిస్తున్న వందల కొలది సంసారాల్లో తనూ ఒక గూటిలోని గువ్వగా బ్రతుకుతున్న శ్రమజీవి నీలూ. కర్మాగారంలోని వివిధాకారాల, వివిధ పరిమాణాల యంత్రాల మధ్య తనూ ఒక చిన్నసైజు యంత్రంలా బ్రతకడానికి అతడు అలవాటు పడిపోయాడు. పవలంతా శ్రమ. సాయంత్రం షికారు. హోటల్లో తిండి. ఎంతకూ తెల్లవారని రాత్రులలో ఒక పట్టాన తెమిలిచావని ఆలోచనలు. పడుకుని నిద్రపోవడానికి ప్రయత్నిస్తున్న సమయంలో మదిలో అద్భుతమైన ఊహ మెదిలినట్టు తోచి, అది కాస్తా విస్మృతిపథంలోకి జారిపోక మునుపే కాగితంపైన పెట్టాలన్న బలీయమైన కోరికతో అతడున్నట్టుండి లేచి కూర్చునేవాడు. లేచికూర్చున్న తర్వాత ఒకటి రెండు క్షణాలకు గానీ అతనికి తెలిసివచ్చేది గాదు - ఈ గదిలో కాగితాలు లేవు. అంతకు మునుపే కలం మృగ్యం. ఐనా అలాంటి అప్రాచ్యపు పని చేయడానికి తాను మునుపటి నీలకంఠం కాదు. మట్టికూజాను నోటిదగ్గరకు వంచుకుని, నాలుగు గ్రుక్కల మంచినీళ్ళు త్రాగి అతడు మళ్ళీ చాపపైకి వ్రాలిపోయేవాడు....

తనంతట తానుగా సృష్టించుకున్న ప్రవాస కారాగారంలో నీలూ శేష జీవితం అలాగే గడచిపోయి

ఉండవలసింది! కానీ విధికి వినోదాలంటే సరదా! ఉగాదులకు గానీ, ఉషస్సులకు గానీ నోచుకోని ఆ చీకటి బ్రతుకు నిండుగా పన్నెండేళ్ళు అలా కొనసాగిన తర్వాత నీలూ జీవిత నాటకం ఒకచోట హఠాత్తుగా మలుపు తిరిగి, ఆ మలుపు దగ్గరినుంచీ నూతనాంకం ప్రారంభమైంది.

చలికాలపు రోజులు. ఆదికాలం నుంచీ మానవుడి గర్భశత్రువు చలి. ఆ సంవత్సరం అది మరింతగా విజృంభించింది. అందుకు తోడుగా కార్మికుల వాడల్లో విషజ్వరాలు ముసురుకున్నాయి. ఏ కారణం వల్లనైనా ఒక వ్యక్తి రెండు మూడు రోజుల వరకూ కనిపించకపోతే, అతడు విషజ్వరాలకు ఆహుతై ఉంటాడని భావింపవలసి వచ్చేది. అలాంటి పరిస్థితిలో ఫ్యాక్టరీలో హాజరు గుర్తించే గుమాస్తా రెండురోజులుగా నీలూ పనికి గైర్ హాజరవుతున్నాడన్న వార్త గాలిలోకి వదలిపెట్టాడు. శ్రేయోభిలాషులు కొందరు ఆ వార్త బెంబడి నీలూకోసం వెదుక్కుంటూ అతడి గదిలోకి వచ్చి చూచారు. జ్వర తీవ్రతతో గడగడలాడిపోతున్న శరీరాన్ని కంబళి పొరల క్రింద ముదరచుట్టుకుని చాపపైన ముద్దలా పడి ఉన్నాడు నీలూ.

దిక్కూ, దరీ లేని రోగుల పాలిటికి ఏకైకాశ్రయమైన ప్రభుత్వ వైద్యాలయానికి నీలూను చేరవేసి, అతంటితో శ్రేయోభిలాషులు తమ కర్తవ్యాన్ని నిర్వర్తించుకున్నారు.

శరీరం నిప్పులా కళపెళ లాడుతున్న స్థితిలో తాను వైద్యశాలలో ప్రవేశపెట్టబడటం మాత్రమే నీలూకు తెలుసు. ఆ తరువాత ఏం జరిగిందో అతనికి తెలియదు. అసలు ఒక విషయం తెలియడానికిగానీ, తెలియకపోవడానికి గానీ హేతుభూతమైనది ప్రాణిలోని జీవ చైతన్యం. అది కాస్తా లుప్తమైనప్పుడు, లేదా అస్తినాస్తి వికిత్సకు లోనైనప్పుడు ఇక తెలియడము, తెలియకపోవడము అన్న ప్రసక్తికి తావేలేదు. అలాగైతే బొందిని వదలి, ఎటకో వెళ్ళిపోయిన జీవుడు మళ్ళీ గూటిలోకి చేరుకోడం ఎలా సంభవమైంది? రోగానికీ చికిత్సకూ జరిగిన హోరాహోరి పోరాటంలో చికిత్సకే విజయం లభించిందన్నమాట. చేతికందిన కబళం నోటికందక పోవచ్చునని చెబుతారు పెద్దలు! తన విషయంలో మృత్యుదేవత కలాంటి ఆశాభంగమే కలిగివుంటుంది.

కానీ ఈ సంఘటన వల్ల మృత్యువుకూ మనుగడకూ ఉన్న మధ్యదూరం మిక్కిలి స్వల్పమని తేలిపోయింది. ఇది అది కావడం ఏ క్షణాన్నయినా సంభవమే! ఎలాగూ తన నీసారి మృత్యువు కబళించింది గాదు. అంతపనీ జరిగేలోగా తాను చేయవలసిన పని ఒకటి ఉంది.... తీర్చుకోవలసిన కోరిక ఒకటి ఉంది.

అక్కడే ఆగిపోకుండా నీలూ ఆలోచన మరికొంత దూరం కొనలు సాచింది - ఈ చిన్నకోరిక తీరకుండా తాను చనిపోవడం భగవంతుడికి అభిమతమై ఉండదు. తన జీవితం ఇలా పొడిగింపబడటానికి యింతకంటే సముచితమైన కారణం స్ఫురించదు.

స్వస్థానాన్నీ స్వజనాన్నీ విడనాడి తానీ దూరప్రాంతంలో స్థిరపడి పోయిన తర్వాత పన్నెండేళ్ళు కాలగర్భంలో కలిసిపోయాయి. శరీరాన్నయితే లాక్కొచ్చి యిక్కడ పారేశాడు గానీ, మనసు మాత్రం వీలు దొరికినప్పుడల్లా తన కట్టడి తప్పి నిషిద్ధ వలయంలోకి పారిపోతూనే ఉంది. ఎంతగా తప్పుచేసినా పార్వతి తన భార్య. తప్పిద మేమీ చేయక పోయినప్పటికీ నిష్కారణంగా పితృవాత్సల్యానికీ, పితృ సాన్నిధ్యానికీ దూరమైన పసివాడు. వాళ్ళేమై ఉంటారు? ఇప్పుడేం చేస్తుంటారు? ఆరిపోదనుకున్న ద్వేషంతో, చల్లార దనుకున్న కోపంతో తాను సంసారాన్ని పరిత్యజించాడు. కానీ మాయలమల్లి లాంటిది కాలం! ఎలాంటి తీవ్రమైన భావాలైనా, మరెలాంటి గాఢమైన అనుభూతులైనా గాలికి తెరచిపెట్టిన కర్పూరంగా హరించుకుపోయి, కాలక్రమాన ఆచూకీ లేకుండా మాయమవుతుంటాయి. అలనాటి

ద్వేషమూ, కోపమూ తన గుండెగూడులో ఇంకా అలాగే నిక్షిప్తమై ఉన్నాయనుకోడం తన మట్టుకు తనకే అసంగంతంగా భాసిస్తోంది. ఐనా చెల్లాచెదరైన కుండపెంకుల్ని మళ్ళీ ఒకటిగా చేర్చి అతకడం సాధ్యమని గానీ, అవసరమని గానీ తాను భావించడంలేదు. కానీ పితృదేవతలంతటివాళ్ళు సూక్ష్మ శరీరాలతో వచ్చి ఏడాది కొకనాడు తమ సంతతి వాళ్ళను చూచిపోతుండగా తన కిలాంటి కోరిక కలగడంలో విడ్డూరమేమీ లేదు! గ్రహచార దుర్విలసనం వల్ల అండ ఆదరవూ గోల్పోయిన ఆ తల్లీ బిడ్డల పరిస్థితులు యిప్పుడెలా వున్నాయో తెలుసుకోగలిగితే చాలు...

జబ్బు నయమై లేచి నడయాడేపాటి ఓపిక సమకూరగానే నీలూ నేరుగా పోస్టాఫీసుకు వెళ్ళాడు. సేవింగ్సు అకౌంటును రద్దు చేసుకోడం వల్ల బరువెక్కిన జేబుతో తిన్నగా రైల్వే స్టేషనుకే దారితీశాడు. ఆప్తబంధువుల కోసం వేచి చూస్తున్న పెళ్ళివారి విడిదిలా స్టేషను సందడిగా ఉంది. రోజూ చూస్తున్న రేలై అది! కానీ ఆరోజది ఎండిపోయిన యిసుక తిన్నెలపైకి అప్పుడప్పుడే సాగివస్తున్న కొత్త నీటి ప్రవాహంలా పరుగెడుతోంది. ఒకవేళ రైలు మెల్లగా నడచినా అది మనిషికన్నా వేగంగానే పరుగెడుతుంది. కానీ మానవుడి మనోవేగంతో పోల్చి చూస్తే రైలు వేగం చాలా తక్కువ. దిశాంచలాల దాకా పరచుకుని పడివున్న నల్లరేగడి చేలవైపు చూస్తూ నీలూ కిటికీ దగ్గర కూర్చున్నాడు. రొప్పుకుంటూ, రోజుకుంటూ ఈ రైలదేపనిగా రెండు రాత్రులు, రెండు పవళ్ళూ పరుగెడితేగానీ తాను గమ్యస్థానం చేరుకోలేడు. గడచిపోయిన పన్నెండేళ్ళ ప్రవాస జీవితం మాటకేమిగానీ ప్రారంభమైన ఈ రెండునాళ్ళ రైలు ప్రయాణం తన ఓర్పును విషమ పరీక్షకు గురిచేస్తోంది.

వింతలకూ విడ్డూరాలకూ నిలయమైన ఈ ప్రపంచంలో అన్నింటికన్నా విచిత్రమైనది మానవుడి మనోలక్షణం. ఏండ్లుగా పూండ్లుగా ఎదలో పేరుకున్న పట్టింపు ఒక చిన్న సంఘటనతో సమసిపోతుంది. కొన్ని వందల యేండ్ల తపోసాధన వల్ల లభ్యమైన ఆత్మనిగ్రహం ఒక్క క్షణంలో సడలిపోతుంది. ఒక దశాబ్దానికి పైగా నా అన్న వాళ్ళెవరూ తనకు లేరన్న తెచ్చికోలు నిర్ణయంతో మనసు రాయిగా చేసుకున్న నీలూ చిట్ట చివరి పదినాళ్ళలో తన భార్యాబిడ్డలకోసం పరితపించి పోయాడంటే, రెండు రోజుల రైలు ప్రయాణం అతని పాలిటికి రెండు యుగాల అనంత యాత్రలా భాసించిందంటే చిత్రమైన మనోలక్షణానికి యింతకంటే చక్కని నిదర్శనం ఎక్కడుంటుంది?

రైలు పరుగెడుతోంది .....

రకరకాల మనుషులు. వచ్చిపోతున్న స్టేషన్లు. బెదిరినట్టుగా రైలు కెదురుగా పరుగెడుతున్న ప్రకృతి దృశ్యాలు. కళ్ళ ఎదుట తెరపిలేకుండా మారిపోతున్న దృశ్యాలను చూడలేక కళ్లు మూసుకున్నాడు నీలూ. కర్ణసుభగంగాని మాటలు అర్థంలేని శ్రవ్య నాటికలా వినిపిస్తున్నాయి. ఆ శ్రవ్య నాటికకు నేపథ్య సంగీతం సరఫరా చేస్తోంది రైలు. సాయంత్రమైంది. చీకటి పడింది. సాంద్ర తిమిరచ్ఛాయ క్రిందలి కొండలూ, కోనలూ కొలువు తీర్చిన పిశాచాల మూకలా భయంకరంగా ఉన్నాయి. అందుకు తగ్గట్టుగా నీలూ మనసు గూడా గందరగోళంగా ఉంది. నడుస్తున్న రైల్లో కాలాన్ని వేగించడానికి ఉన్నదొక్కటే సులభోపాయం. నిదుర పోగలిగితే ఎక్కడో కొన్ని వందల మైళ్ళు దూరంలో తెల్లవారుతుంది. కానీ రమ్మనగానే రావడానికి నిద్ర మానవుడి చెప్పుచేతల్లో లేదు. ఐనా ప్రాధేయపడి చూడాలనుకున్నాడు నీలూ. దొరికిన కొద్దిపాటి జాగాలో ఒళ్ళు ముడుచుకుని పడుకున్నాడు. ఎప్పుడో నిద్రపట్టింది......

తెల్లవారకమునుపే అతడు నిద్ర మేలుకున్నాడు. మేలుకోగానే నీలూ ఒడలు పులకరించింది. అలసిపోయిన శరీరాలకు సేదదీరుస్తూ మలయమారుతం వింజామరంలా విస్తోంది. అనతిదూరంలోనుంచీ

కలకంఠి మధురాలాపం ఆపాత మధురంగా వినిపిస్తోంది. మలయపవనం కంటే చల్లగా, పికకూజితం కంటే తీయగా అచ్చమైన 'తల్లి పలుకులు' చేరువలో నుంచీ అతనికి వినిపిస్తున్నాయి.

తల పైకెత్తి కిటికీగుండా వెలుపలికి చూచాడు నీలూ, రైలు - ఉషఃకాంతుల వెలుగుల్లో పరవశించిపోతూ, ప్రాభాత సమీరంలో ఉల్లాసంగా కబుర్లు చెప్పుకుంటున్న తెనుగు దేశపు కేదారాల మధ్య పరుగిడుతోంది.

"ఎంత చల్లటిగాలి ఈ వేళ వీచెడిని

ఎంతగా నా హృదయ ముప్పొంగి పోయెడిని....."

గొంతెత్తి పాడ దలచుకున్నాడు నీలూ. మరుక్షణంలో జ్ఞప్తికి వచ్చిందతనికి - తనది మూగవోయిన గొంతుక. పూర్వాశ్రమంలో తాను పాటలు వ్రాసుకునేవాడు. వ్రాసుకున్న పాటలను గొంతువిప్పి గుండె కలిపి పాడుకునేవాడు. ఆ రోజులు కావు! ఆ రోజు లికరావు! ఈ పాటైనా తన కిప్పుడు పూర్తిగా జ్ఞప్తిలోలేదు. మళ్ళీ వ్రాయాలనుకుంటే భావన పరుగిడుతుందనిగానీ, రసావేశం సహకరిస్తుందనిగానీ నమ్మకం లేదు. లాభం లేదు! సాహిత్యలోకానికి సంబంధించినంత వరకూ రచయిత నీలకంఠం కాలపురుషుని మహోదరంలోని సుదూర సీమలలోనికి విసరివేయబడిన అభిశప్తుడు! మళ్ళీ ఈనాడు అతడు బ్రతికి వచ్చాడని చెబుతే నమ్మేవాళ్ళెవరూ ఉండరు!

సూర్యోదయ మయ్యేసరికి రైలొక పెద్ద జంక్షనులో ఆగింది.

పొగబండి స్టేషనులోకి రాగానే మున్ముందుగా స్వాగత సత్కారాలకు సిద్ధమయ్యేవాడు పేపర్ల కుర్రవాడు. మామూలు మేరకు ట్రవుజరు తొడుక్కొని పైన బనీను వేసుకున్న కుర్రావాడొకడు పత్రిక అమ్ముకుంటూ ప్లాట్‌ఫారం పైన పరుగిడుతున్నాడు.

"ఇదిగో అబ్బాయ్! నిన్నే...." పిలిచాడు నీలూ.

"పిలిచారా బాబూ!" పరతెంచి వచ్చేశాడు కుర్రవాడు.

"నీ దగ్గరున్న పత్రికలన్నీ రకాని కొకటి చొప్పున పడెయ్....." అన్నాడు నీలూ.

కుర్రవాడి ముఖం వికసించింది. మోపెడు బరువులో నుంచీ కావలసిన పత్రికలు చేతికి తీసుకుంటూ అతడు కాస్త మనోగణితానికి గూడా పూనుకుని "మూడుం పావలా" అన్నాడు.

డబ్బు చెల్లించేశాడు నీలూ. పత్రికలు చేతికి తీసుకున్నాడు. నాలుగు బారల దూరం ముందుకు వెళ్ళిపోయిన పేపర్ల కుర్రవాడు అంతలో అమూల్యమైన విషయమేదీ స్ఫురణకు వచ్చినట్టు గిరుక్కున వెనుదిరిగి "పుస్తకాలేవైనా అవసరమా బాబూ" అని వినంగా హెచ్చరించుకున్నాడు.

"పుస్తకాలా! ఎక్కడున్నాయి?"

"ఇదిగో, ఈ సంచీలో ఉన్నాయి......" మోచేతికి వ్రేలాడుతున్న సంచీ లోపలికి చూస్తూ చెప్పుకపోతున్నాడు - "నిన్నటి రాత్రి. నీ ప్రేయసి మొగుడు - కాళింది కాదురా కాల నాగు...."

"అవన్నీ ఏమిటి?" విస్మయంతో ప్రశ్నించాడు నీలూ.

"పుస్తకాలు బాబూ, పుస్తకాలు....."

కాసేపు తటపటాయించి "యిప్పటికీ పత్రికలు చాలు. వాటి సంగతి తరువాతెప్పుడైనా తీరిగ్గా చూస్తాను" అన్నాడు నీలూ.

కానీ ప్లాటుఫారం పైన తాను సాగిస్తున్న సాహిత్య విస్తరణోద్యమం పాలిటికి మహారాజ పోషకుడులా ప్రత్యేక్షమైన పెద్దమనిషిని అంతటితో వదలిపెట్టడానికి మనస్కరించలేదేమో, మరింత

దగ్గరగా వచ్చి ఈసారి తాను ప్రయోగిస్తున్న బాణానికి తిరుగుండదన్న నమ్మకాన్ని ధ్వనిస్తూ - చూడండి బాబూ! నా దగ్గర 'జరీచీర జవ్వని' గూడా ఉంది'' అన్నాడు పేపర్ల కుర్రవాడు.

"అది కూడా పుస్తకమే నేమిటి?''

"ఎరుగరా బాబూ! నీలకంఠం రచన. నిన్ననే వచ్చింది.

నీలూ నివ్వెరపడిపోయాడు. ఈ నీలకంఠు డెవరు? సాహిత్యాకాశంలో యితగా డెప్పుడు మొలిచాడు?

మౌనాన్ని అంగీకరాం క్రింద జమకట్టి పత్రికల కుర్రవాడు 'జరీచీర జవ్వని'కి సంచీలోనుంచీ విముక్తి ప్రసాదించాడు.

మిఠాయి ముక్కలా చిన్నసైజు పుస్తకం. కంటిపాపకు గిలిగింతలు పెట్టే అందమైన ముఖచిత్రం. పెద్దసైజు అక్షరాలతో కొట్టవచ్చినట్టుగా కనిపిస్తున్న రచయిత పేరు. ఒక్కవూపులో ఆఖరుదాకా పుటలు తిప్పేశాడు నీలూ. అతడి చూపులు వెనుకవైపు అట్టపైన నిశ్చలంగా నిలిచి పోయాయి.

మనిషిని నవ్వే జంతువుగా పేర్కొంటారు. నవ్వడంలా ఆశ్చర్యపడడం గూడా మానవుడి వ్రభావమే! నవ్వుతూ ప్రాణాలు గోల్పోయిన ఉదంతాలు వార్తాపత్రికల్లో అప్పుడప్పుడూ కనిపిస్తుంటాయి. ఆశ్చర్యం వల్ల నీలూ సైతం అలాంటి పరిణామానికి లోనుగావలసిన సందర్భమే అది! కేవలం అదృష్టం వల్లనే గావచ్చు, నీలూ అపాయంనుంచీ తప్పించుకున్నాడు.

అట్టపైన ముద్రింపబడి వున్న ఛాయాచిత్రం ముమ్మూర్తులా తనది!....

దానిక్రింద వివరణ గూడా ఉంది -

నీలకంఠం గారి అముద్రిత రచనల్ని పాఠకుల కందించే భాగ్యం తమకు గలిగినందుకు ఆశ్లేషా ప్రచురణాగారం వాళ్లు గర్విస్తున్నారట! 'జరీచీర జవ్వని' ప్రచురణ ద్వారా చేబట్టిన సత్కార్యంలో మళ్ళీ ఒక అడుగు ముందుకు వేయగలిగినందుకు వాళ్లు మరెంతగానో ఆనందిస్తున్నారట? ఇంకా మిగిలివున్న నీలకంఠం గారి అముద్రిత రచనలను వాళ్ళిలాగే పాఠకలోకానికి సమర్పించుకోగలరట:

"డబ్బిస్తారా బాబూ!'' పత్రికల కుర్రావాడు డబ్బుకోసం చేయిచాస్తున్నాడు.

మూల్యం ముట్టజెప్పి నీలూ కుర్రవాడి బారినుంచీ బయటపడ్డాడు. క్రిందికి దించుకున్న ట్రంకును భుజాన వేసుకుని, ఎట్టయెదుట బారగిల తెరచివున్న వెయిటింగు రూములో జొరబడ్డాడు. కుర్చీలో కూలబడి పుస్తకం తెరిచేశాడు....

చదివి ముగించేసరికి గంట తొమ్మిది కావచ్చింది.

వెలుపలికి చూచాడు నీలూ. ప్లాట్‌ఫారంలో రైలులేదు.

వాకబుచేయగా రైలు అరగంటకు మునుపే వెళ్ళిపోయినట్టు తెలిసింది. మళ్ళీ రాత్రి పదింటికి గానీ బండిలేదు. కానైతే తాను టిక్కెట్టు కొనుక్కోడం కూడా ఈ స్టేషను వరకే కొనుక్కున్నాడు. పోగా తన ప్రయాణం యిలా ఆగిపోవటం కూడా కూడా ఒకందుకు మంచిదే ననుకున్నాడు నీలూ. బుక్‌స్టాలుకు వెళ్ళి అతడు నీలకంఠం సాహిత్యాన్ని టోకుగా కొనేశాడు. లభ్యమైన అయిదారు పుస్తకాలతో మళ్ళీ వెయిటింగ్ రూంలో ప్రవేశించాడు.

ప్రొద్దెక్కుతున్నకొద్దీ ధూమశకటాగారం కర్ణకఠోరమైన వివిధ రావాలకు ఆలవాలమై పోతోంది. బూడిదనేలపైన్నుంచీ వేడిగాలి విసురుగా వీస్తోంది. ఒకటి, రెండు పుస్తకాలు మాత్రం పూర్తిగా చదివి మిగిలిన వాటిని స్థాలీపులాక న్యాయంగా అందందు పరికించి, చూచి ముగించిన ప్రతి పుస్తకాన్ని టేబులుపైకి గిరవాటుపెట్టి, దిమ్మెక్కిపోయిన తలను చేతుల్లోకి తీసుకుని వాలుకుర్చీలోకి సోలిపోయాడు

నీలూ.

ధర్మగోవు ఒంటికాలితో నడుస్తున్న ఈ కలికాలంలో సైతం యిలాంటి ఘోరకలి జరగడానికి వీలుంటుందని నీలూ ఎన్నడూ భావించలేదు. సుషుప్త్యావస్థలో లీనమయ్యే రుగ్మత తనకు లేదుగనుక ఈ పుస్తకాలు తాను వ్రాసినవి కావనేది నిర్వివాదాంశం. తాను వ్రాయని పుస్తకాలను తన పేరు కంటగట్టిన సాహసం మాటకేమిగానీ, ఈ ఘోరకలిలో అంతకు మించిన దుస్సాహసం వేరొకటుంది. చెట్టు పేరు చెప్పి, కాయలమ్ముకున్నట్టుగా తన పేరును వినియోగించుకో దలచుకున్న బుద్ధిమంతులు వీలైనంతలో రచనా విషయకంగా తాను పాటించిన నియమాలను అనుసరించడం న్యాయం! ఆ కనీసపు అపద్ధర్మాన్ని సైతం వాళ్ళు త్రోసిరాజన్నారు. తీసుకున్న యితివృత్తంలో గానీ, కుదిరించుకున్న శైలిలోగానీ, సాగించిన కతనంలోగానీ వీళ్ళు పోయిందీక కొత్త పోకడ! పోకడ అనడంకన్నా పోకడలు అనడం సమంజసం. ఎందకంటే శైలిగానీ, కథనం గానీ ఒకచోట వున్నట్లు మరొకచోట లేవు. సాహిత్యం యొక్క ఉద్దేశం లోకానికి శ్రేయస్సును సందించడమే నంటుంది సాంప్రదాయం. ఈ సాంప్రదాయానికి చెందని విజ్ఞాని ఒకాయన కలలు యావత్తు నిష్ప్రయోజనమని గూడా సెలవిస్తాడు. గొప్ప ప్రయోజనం సమకూర్చకోపోతే మానె, బొత్తిగా ప్రయోజనం లేకపోయినామానె, పనిగట్టుకుని దుష్ప్రయోజనం సాధింపదలచుకున్న వాళ్ళను గురించి తనేమనుకోగలడు? ఇలాంటి బూతును, ఇంతటి చెత్తను తన తలకంట గట్టడానికి వీళ్ళకు తనే మపకారం చేశాడు? ఈ అశ్లేషా పబ్లిషర్లు ఎవరోకానీ, వీళ్ళు తనను పట్టి తెచ్చి నాలుగు నిలువుల గోతిలో పాతిపెట్టి సజీవంగా ఖనన క్రియలు నిర్వర్తించి వుంటే యింతకంటే బాగుండేది!

నీలూ కళ్ళు విస్ఫులింగాల్లో మండుతున్నాయి. కోపంతో అతడి ముఖం జేవురించింది. అతడు పళ్ళు పటపట కొరుక్కున్నాడు.

క్రమంగా కోపం దిగజారిపోగా ఖిన్నుడై పోయాడు నీలూ. కారణాంతరాలవల్ల యిటీవల జీవితకాలంలో తాను రచనా వ్యాసంగాన్ని అసహ్యించుకున్నమాట నిజమే! కానీ తన అంతరాంతరాల్లో అందుకు విరుద్ధమైన భావన నిక్షిప్తమై వుండడం అంతకంటే వాస్తవం. రెండు దశాబ్దాల పర్యంతం అదొక తపస్సులాగా కొనసాగించిన సాహిత్య వ్యాసంగాన్ని గురించి తలచుకొని తను పరవశించి పోయేవాడు. ఆ కృషి వల్ల తన బ్రతుక్కు లభించిన కాంతినీ, తన మనసుకు లభించిన శాంతినీ మినహాయిస్తే, తన జన్మ తృణంలా హీనమైనది. కాష్టంలా శుష్కమైనది. తన అంతర్ధానం వాళ్ళకెవరికో బాగా ఉపకరించింది. అవకాశం దొరకగానే వాళ్ళు తన వ్యక్తిత్వంపైనే పేడనీళ్ళు చల్లేశారు. జరిగిపోయిన ఈ దురాగతం మూలంగా తన పేరు ప్రతిష్ఠ ఈ పాటికి బూడిదలో పోసిన పన్నీరులా అణగారిపోయి వుంటాయి.

కృతనిశ్చయుడై లేచి నిటారుగా కూర్చున్నాడు నీలూ. వీల్లేదు! అలా జరగడానికి వీల్లేదు! ఖార్ఖానా పొగల్లో చూరిపోయి, తన స్వరూపం వికృతంగా మారిపోయి వుండవచ్చు. ఇన్నేళ్ళ తర్వాత యిప్పుడు వ్రాయడానికి పూనుకుంటే కలం సాఫీగా సాగక దస్తూరీ గూడా కుదరకపోవచ్చు. తానే నీలకంఠమని చెబుతే లోకులు నమ్మలేక పోవచ్చు. కానీ తనలోని రచయిత ఏమాత్రం ప్రాణావశేషంగానైనా మిగిలివుంటే ఈ అవమానానికి ప్రతీకారం నెరపేదాకా తనకు నిద్రపట్టదు. ఎంతోకాలం తను ప్రవాస జీవితం గడిపాడు. మరికొద్ది రోజులు గడపలేక పోడు. పన్నెండేళ్ళ తన ప్రవాస చరిత్రను సింహావలోకనం చేసుకుంటే చాలు. ఒక బృహత్కథ తయారుగాకపోదు. రచయిత పేరు చెప్పుకుని రచన లమ్ముకోడం సవాలైతే, రచన మూలంగా రచయిత మళ్ళీ లోకంలోకి తిరిగిరావడం ఎదురు

సవాలు. తనకు చుట్టుకున్న దుష్కీర్తి పాలిటికి తుడిచివేతగా, ఆ దుష్కీర్తిని తనకంటగట్టిన వాళ్ళ ముఖాల పాలిటికి మసిపూతగా తన రచన అవతరిస్తుంది.

ఆత్మవిశ్వాసాన్నంతా అరచేతిలోకి తెచ్చుకున్నట్టుగా పిడికిలి బిగించి, బల్లమీద ఒక గుద్దు గుద్దేశాడు నీలూ. చెల్లాచెదురుగా బల్లపైన పడివున్న పుస్తకాలు ఆ దెబ్బతో పైకెగిరి దబేలున నేలపైన పడిపోయాయి.

# 3

"మేనేజింగు ప్రొప్రయిటరు గారిని కలుసుకోవాలి" అన్నాడు నీలూ.

బొత్తులు బొత్తులుగా మూగివున్న కాగితాల ఎదుట కుర్చీలో కూర్చుని, ఏదో వ్రాసుకుంటున్న తరుణ వయస్కుడు తలపైకెత్తి ఆగంతకుడి కేసి చూస్తూ "కూర్చోండి" అన్నాడు.

ఊహించిన దొకటి. ఎదురైనది వేరొకటి. ఆశ్లేషా ప్రచురణాగారమనగా అది మంది మార్బలంతోగూడిన పెద్ద సంస్థకాబోలు ననుకున్నాడు నీలూ. అలాంటిదేమీ కాదు. దానికున్న ఒకే ఒక హంగు - వీధిలో వ్రేలాడుతున్న బోర్డు. లోపల హాల్లో ఈ యువకుడొక్కడు మాత్రం తదేక దీక్షగా తనపనేదో తాను చేసుకపోతున్నాడు.

"ఎందుకోసం వచ్చారో తెలుసుకోవచ్చా?" విస్మయం కలిగించేపాటి వినయంతో అతడు ప్రశ్నించాడు.

నీలూ జవాబు చెప్పే స్థితిలో లేడు. ఆ యువకుడి వాలకం అది, యిది అని ప్రత్యేకంగా వివరించి చెప్పడానికి వీల్లేని ఆకర్షణ ఏదో వుంది. నీలూకు వాకట్టు కట్టడం మాత్రమేగాదు. అది అతడి కళ్ళకు అనిషత్వాన్ని గూడా ప్రసాదించింది. ఈ పడుచువాణ్ణి తానెక్కడో చూచినట్టున్నాడు. లేదా చూచి మరచిపోయినట్టున్నాడు. ఏదో స్మృతి. ఏదో మరపు. ఆ రెండింటి మధ్యా నీలూ మనసు ఉయ్యాలలూగుతోంది:

"ఎందుకోసం వచ్చారో తెలుసుకోవచ్చా?" మళ్ళీ అదే ప్రశ్న - ఈసారి ఒక్కింత బిగ్గరగా.

"మరేంలేదు. నేనొక పుస్తకం వ్రాశాను. దానిన వెలుగులోకి తీసుకురావాలని సంకల్పం.... తెలిసిన వాళ్ళు కొందరు యిక్కడి కొకసారి వెళ్ళి రమ్మన్నారు...."

"తీసుకొచ్చారా పుస్తకం?"

మిత వచనాలు. అంతకంటే మితమైన హావభావాలు. కొంపదీసి తాను మరమనిషితో గాని వ్యవహరించడం లేదు గదా! నీలూ సందేహించాడు....

అందుకున్న పుస్తకాన్ని అత డొకటి రెండుచోట్ల తెరచి చూచాడు. మళ్ళీ మొదటికే వచ్చాడు. అక్కడ దేనికోసమో వెదుకుతున్నట్టుగా ఒకటి రెండు క్షణాలు ఆగి, తటాలు తల పైకెత్తి, "ఇందులో రచయిత పేరెక్కడా ఉదహరించబడినట్టు లేదు....." అన్నాడు.

"నిజమే! ఉదహరించవలసిన అవసరం లేదనుకున్నాను."

"అంటే?"

"ఈ రచన అనామకంగా - అంటే రచయిత పేరులేకుండా ప్రకటించబడాలన్నదే నా ఉద్దేశం."

"ఎందుకు?"

"రచయిత ఆ రంగానికి కొత్తవాడు కావచ్చు. లేదా సుప్రసిద్ధుడు గావచ్చు. అంటే ఏమన్నమాట? రచయిత పేరునుబట్టి పాఠకులు ఆదిలోనే ఒక నిర్ణయానికి రావడానికి వీలుంటుందన్నమాట!

నేను సూచిస్తున్న ఉపాయం ఆ ప్రమాదాన్ని పరిహరిస్తుంది......"

కానీ ఎదుటి వ్యక్తి ఆ సమాధానాన్ని వినిపించుకున్నట్టే లేడు. అతడి చేతిలోని పుస్తకంలో నిమిషానికి నాలుగైదు కాగితాల లెక్కన వెనక్కు వెళ్ళిపోతున్నాయి. ఆవిధంగా అతడు రచయిత నలాగే కుర్చీలో కూర్చోబెట్టి రచనను సాకల్యంగా చదివేసేటట్టున్నాడు.....

పది పదిహేను రోజులుగా మనసులో పొంగిపొరలుతున్న కోపం కట్టలు తెంచుకోడానికి సిద్ధంగా వున్న ఆ తరుణంలో, మునిగాళ్ళ మీద నిల్చున్న ఉక్రోషం ముందుకురకడానికి అర్రులు చాస్తున్న ఆ సమయంలో ఎంతో బలవంతంపైన తనను తాను సంయమించుకుని నీలూ కుర్చీ కంటిపెట్టుకుని కూర్చున్నాడు. కానీ ఆశ్చర్యమేమిటంటే సూర్యరశ్మిలో పొగమంచులా అతడి భావోద్రేకం క్షణక్షణానికీ చప్పబడిపోతోంది. కన్నెత్తి ప్రత్యర్థివైపు చూడగానే వాడి బలంలో సగం వాలికి సంక్రమించేదని ఓ పురాణ గాథ చెబుతుంది. ఎట్టయెదుట కుర్చీలో కూర్చున్న ఆ పడుచువాడి సాన్నిధ్యంతో నీలూ పరిస్థితి సైతం యించుమించు అలాగే పరిణమిస్తోంది. ఆ యువకుడి ముఖంకేసి చూస్తుంటే కోపగించుకోడానికి మనస్కరించడం లేదు సరిగదా అతగాడి అజ్ఞానాన్ని మన్నించివేయాలని గూడా అనిపిస్తోంది. శత్రువే ఔగాక! అంతమాత్రాన వాడిలోని గుణవిశేషం స్తవనీయం గాకపోదు. నిస్సందేహంగా మెచ్చుకోదగ్గది ఈ యువకుడి కార్య వ్యగ్రత. పట్టాభిషేకోత్సవ సందర్భంలో సాక్షాత్తు ఎలిజబెత్తు రాణి ఆ వీధిగుండా ఊరేగుతుందనితెలిసినా అతడు చేస్తున్న పనిని వదలిపెట్టి కుర్చీలోనుంచి లేచేటట్టులేడు!

నీలూ అంతలో మనసు మార్చుకున్నాడు. ఈ యువకుడిది అజ్ఞానంగా తలపోస్తున్న తనకంటే అజ్ఞాని వేరొకడుండడు. త్రాగవలసిన పాలంతా త్రాగి నీరెత్తిన నిమ్మలా నిశ్చలంగా కూర్చున్న పిల్లికూన యిది! అదనుకు నేర్చిన గుణపాఠం వెయ్యి కఠినశిక్షల పెట్టు! రచనాహోమంలో తాను ఆయుష్కాలాన్ని వెన్నలా కరిగించుకుంటే ఆ హవిస్సును దేవతలా భక్షించడానికి వీడెవ్వడు?

పుటవైపొకసారి చూచి కంటికానిన ఒకటి రెండు వాక్యాలను బట్టి కథాక్రమాన్ని గ్రహిస్తూ వేగంగా చదువుకుంటూ వెళ్ళే పద్ధతిలో ఆ యువకుడొక అరగంట సేపట్లో కథాంతంలోకి వచ్చేశాడు. పూర్తికాగానే పుస్తకం మూసేస్తూ అతడు నీలూవైపు వంగి "ఇందుకోసం చాలా శ్రమపడినట్టున్నారు మీరు" అన్నాడు.

"నా శ్రమ గుర్తింపబడినందుకు సంతోషం" అన్నాడు నీలూ.

"కానీ ఒకమాట చెబుతాను మీకు! ఈ పుస్తకం మీది! దీనిపట్ల మీకో అభిప్రాయం ఏర్పడి వుంటుంది. ఆ అభిప్రాయానికి విరుద్ధమైన మాట ఎవ్వరైనా చెబుతే మీకు కోపం వస్తుంది. ఐనా నిజం చెప్పక తప్పదు. ఉన్న యిబ్బంది అది! అందుకే ఒక్క మాటలో చెబతున్నాను. మీ శ్రమ వేరొకవిధంగా వినియోగమై వుంటే చాలా బాగుండేది.'

నీలూ అందుకోడానికి వీలుగా పుస్తకాన్ని మేజా అంచు దగ్గరగా వుంచి అతడు మళ్ళీ కలం చేతికి తీసుకున్నాడు.

"ఇదిగో అబ్బాయ్!" గర్జించాడు నీలూ. "ఈ పనికిమాలిన గొడవవల్ల యిప్పటికే నీ పనికి అంతరాయం వాటిల్లింది. మరికొంతసేపు నువ్వీ అంతరాయానికి తట్టుకోక తప్పదు...."

"ఎందుకూ?" తెల్లబోతున్నట్టుగా అతడు ప్రశ్నించాడు.

"నువ్వు చేస్తున్న నామర్దా పనికన్నా నా ప్రసంగం అమూల్యమైంది కనుక!"

"అలాగా!" చేతులు పైకెత్తి అతడు ఒళ్ళు విరుచుకో సాగాడు.

"కొందరిని ఎల్లకాలమూ మోసగించవచ్చు. అందరినీ కొంతకాలం మోసగించవచ్చు. కానీ ఎల్లకాలమూ అందరినీ మోసగించడం సాధ్యం కాదు....."

"తెలుసు! అది ఆంగ్లంతో ఒక సూక్తి....."

నీలూ అతడికేసి చురచుర చూచాడు. ఆ చూచిన చూపుల్లో పాతకాలం నాటి జ్ఞాపకాల నీలినీడ లేవో పొడగట్టి ఎదుటివ్యక్తి త్రుళ్ళిపడ్డాడు.

"పండినపాపం కోతకు వచ్చినప్పుడు ఎలాంటి బింకాలైనా సడలిపోతాయి! నీలకంఠం సమాధిపైన డేరా వేసుకుని నువ్వాడిన కపటనాటకానికి ఆయువు మూడింది. అసలైన నీలకంఠం కాదనుకో. అతడి తాలూకు ప్రేతానికి నువ్విప్పుడు జవాబు చెప్పుకోవాలి. కుక్కమూతి పిందెలను రసగుల్లాలుగా చలామణీ చేసిన సాహసానికి నువ్విప్పుడు సంజాయిషీ చెప్పుకోవాలి....."

యువకుడి ముఖం వెలవెల పోవడానికి క్షణంలో సగంసేపు పట్టలేదు. విచారమూ, విషాదమూ, విస్మయమూ ముప్పిరి వేసుకపోయిన మానసిక స్థితి అతడి ముఖంలో స్పష్టంగా ప్రతిబింబిస్తోంది. ఉక్కుశలాకలాంటి ఆ పడుచువాడు వాడిపోయిన తోటకూర కాడలా బల్లపైకి వాలిపోయాడు.

"కాలం గడిచిపోతోంది." హెచ్చరించాడు నీలూ.

"నిజమే! దోషం నాది. అసందిగ్ధంగా నేను నా నేరాన్ని అంగీకరిస్తున్నాను గూడా!" అవనతముఖుడై నేలవైపు చూస్తూ ఆ యువకుడు మారుమాటలేకుండా తన నేరానికి ఒప్పికోలు ప్రకటించాడు.

ఒక్క నిముషం తరువాత మళ్ళీ అతడే కొనసాగించాడు.

"ఈ అభియోగంలో మీరు వాదులు. నేను ప్రతివాదిని! మీరు నేరుగా న్యాయస్థానానికి వెళ్ళి వుండవచ్చు. ఎందుకో వెళ్ళలేదు మీరు! బహుశా నాకొక అవకాశం యివ్వాలని భావించి వుంటారు. ఈ అవకాశాన్ని సార్థకం చేసుకోవాలన్న ప్రయత్నం న్యాయం గాకపోదనుకుంటాను....."

"ఉపోద్ఘాతం అనవసరం!" నీలూ విరుచుక పడ్డాడు.

"మన్నించాలి మీరు! సూటిగా చెప్పడానికే ప్రయత్నిస్తున్నాను. లోకంలో లక్షలాది మానవులు పుట్టి పెరిగి చనిపోతున్నారు. వ్రేళ్ళకు నీళ్ళందకపోతే చెట్లు పెరగవు. సుఖంగా బ్రతకాలనుకోడం, అందుకోసం ప్రయత్నించడమూ మానవుడి స్వభావం! నేను దురదృష్టవంతుణ్ణి! శారీరకరంగానూ, మానసికంగానూ వికాసదశను అందుకోక మునుపే నేను బ్రతుకు బరువును మోయవలసి వచ్చింది. ఆధారపీఠమంటూ ఒకటి లేనిదే మానవుడు నిల్చోలేడు. నా బ్రతుక్కు ఆధారంగా మా నాన్నగారు గడించిం దేమిటో చెబుతున్నాను. ఆయనొక వైపున కీర్తిని సంపాదించి రాశిపోశారు. మరొక వైపున దుర్భరమైన దారిద్ర్యాన్ని పెంచుకొచ్చారు. పిత్రార్జితమైన ఆ ఆస్తిపాస్తుల్లో మొదటిది పెట్టుబడిగా నేను రెండో దానితో పోరాడవలసి వచ్చింది...."

మదిలో లీలగా మెదిలిన అనుమానం నిజంగా పర్యవసిస్తున్న ఆ తరుణంలో నీలూ చేష్టలుడిగి అప్రతిభుడై పోయాడు.

ఆ యువకుడు తటాలున కుర్చీలోనుంచీ పైకి లేచాడు. ద్వారాన్ని సమీపించి బిగ్గరగా "అమ్మా" అని పిలిచాడు.

నీలూ పాదల క్రిందలి భూమి క్రుంగిపోతోంది.

"కానీ గాజు మేడలు కట్టుకున్న వాళ్ళు యితరుల యిళ్ళపైన రాళ్ళు విసరగూడ దంటారు....." అతడు మళ్ళీ ప్రారంభించాడు. 'మీ పేరూ ప్రతిష్ఠలు మీకు ముఖ్యం. వాటికోసం

మీ నీడలో మిమ్మల్ని నమ్ముకున్న వాళ్ళను నిరంతర క్లేశాలపాలు చేయడానికి వెనుదీయరు. నా ఆరోపణలు రెండింటిలో యిది మొదటిది - స్వల్పమైనది గూడా! రెండోది యిది. మీరు రచయితలు. మీ రచనలు మానవజగత్తునకు సంబంధించినవి. మనోధర్మ పరిశీలన మీ రచనావ్యాసంగానికి ప్రాణం. రవిగాంచనిచో కవి గాంచగలడన్న లబ్ధప్రతిష్ఠ మీ సొత్తు. కానీ మీదాకా వచ్చేసరికి మీరు పప్పులో కాలువేయగలరు! పన్నెండేళ్ళు మీతోబాటుగా ఒక యింటి కప్పు క్రింద నివసించిన మానవజీవిని మీ రర్థం చేసుకోలేక పోయారంటే అది మీరు నిజంగా సిగ్గుపడవలసిన విషయం...."

టేబిలు సొరుగును లాగి పుస్తకాల క్రిందినుండీ అతడొక కార్డు ముక్కను పైకి తీశాడు.

"మీ అభిమాన పాఠక మహాశయు డొకాయన వ్రాసిన ఉత్తరం యిది. - మీరు మాయమైపోయిన తర్వాత ఆరు మాసాలకు యిది మీ చిరునామాకు చేరింది. మీ కుటుంబదుస్థితికి జాలిపడుతూ ఆయన చేసిన సహాయాన్ని గురించిన ఉదంతం అందులో వుంది...."

"కాఫీ కోసమేనట్రా ప్రకాశం!"

జీవితంలో ప్రొద్దు పడమటి కింకా వ్రాలకపోయినా అప్పుడే జరాభరాన్ని మోస్తున్నట్టున్న మాతృమూర్తి కాఫీ గ్లాసుతో ద్వారం దగ్గర ప్రత్యక్షమైంది.

"అవునమ్మా! నాకోసం గాదు. ఆయనకోసం" అంటూ ప్రకాశం చరచరా బయటికి వెళ్ళిపోయాడు.

## 4

పై సంఘటన జరిగిన తర్వాత మూడు మాసాలకు -

ఒకనాటి ఉదయం ఉపాహారం సేవించి చుట్టకాల్చుకుంటూ తీరిగ్గా మంచంపైన విశ్రమించాడు నీలకంఠం. చుట్టలోనుంచి పైకిలేచి వలయాలుగా తిరుగుతున్న ధూమమాలికల్లోకి చూస్తూ అతడున్నట్టుండి "చూడు పార్వతీ, మాట...." అన్నాడు.

"ఏమిటండీ!" అంటూ దగ్గరగా వచ్చింది పార్వతమ్మ.

"ఏమిటో మరి! నేనూ ఆలోచిస్తాననుకో. బోధపడి చావటం లేదు. బుద్ధి స్తబ్ధమై పోయినట్టుంది. అబ్బాయి చేసిన పని మంచిదేనో కాదో తెలియదు. వాడు సృష్టించిన సాహిత్యం ఏ దినుసుకు చెందిందో అదీ తెలియదు. కానీ నేనొక్క మాట మాత్రం గట్టిగా చెప్పగలను. వాడు నాకంటే ప్రయోజకుడు...."

మళ్ళీ మూడు మాసాలు గడిచిపోయిన తర్వాత ఓరోజు వేకువజామున వీధి తలుపు తీయడానికోసం వెళ్తూ హాల్లోకి వచ్చింది పార్వతమ్మ. విద్యుద్దీపం క్రింద కూర్చుని ప్రకాశం వ్రాసుకుంటున్నాడు.

"అప్పుడే లేచావా అమ్మా!" పలకరించాడు ప్రకాశం.

"లేచానుగానీరా ప్రకాశం, నిన్నొక మాట అడగాలని! అదేమిట్రా బాబూ, నువ్వు మీ నాన్నగారి పుస్తకాన్ని తేలికచేసి పారేశావటగా?" విస్తుపోతూ అడిగింది పార్వతమ్మ.

ప్రకాశం మెల్లగా నవ్వాడు. అంతలో తల్లి మనసులోని ఆరాటాన్ని గ్రహించాడేమో, నవ్వును మధ్యలోనే త్రుంచేశాడు.

"అదికాదమ్మా! నేను నీబిడ్డను. నాలో ప్రకాశమొక్కడే కనిపిస్తాడు నీకు! ప్రకాశంలో పాఠకుడున్నాడు. రచయిత వున్నాడు. పబ్లిషరున్నాడు. వీళ్ళల్లో ఎవడి అభిప్రాయాలు వాడివి. ఒక

చేతితో చేసిన దానం మరొక చేతికి తెలియనివ్వక పోవడం గొప్ప దాతృత్వానికి లక్షణమని చెబుతారు. అలాగే నాలోని పాత్రలు ఒకదాని అభిప్రాయాలతో మిగిలినవి జోక్యం పెట్టుకోవు. ఐనా నాన్నగారి పుస్తకాని కిప్పుడేం తొందర? ఎప్పుడైనా వేసుకోవచ్చు దాన్ని! అది కాలగతికి మారొడ్డి కలకాలం నిలిచే పుస్తకం!" అన్నాడు ప్రకాశం.

*(భారతి మాసపత్రిక, 1994)*